ఆదివారం

ప్రజాశక్తి

ఫిబ్రవరి 9, 2003



ఈశాన్య ప్రాంత మణిపూస
త్రిపుర

హ్యాపీ బర్త్‌డే

(9-2-2003 నుండి 15-2-2003 వరకు)

పి. సద్గుణ అచ్చయ్యనాయుడు
6॥సం,9. 2. 1997
లీలావతి-శ్రీనివాసరావు
అనకాపల్లి- విశాఖ

సిహెచ్. స్వాతి
4॥సం,13. 2. 1999
వెంకటమ్మ-మానయ్య
రామయ్యగూడెం- వికారాబాద్



టి.కిరణ్‌తేజ
10॥సం,13. 2. 1993
జానకి- కుమారస్వామి
కొత్తూరు- శ్రీకాకుళం

కె. ప్రసన్న కుమార్
9॥సం,13. 2. 1994
నిర్మలారాణి- బుజ్జిబాబు
మిట్టగూడెం- కృష్ణా

ఎ. వాసుదేవరావు
3॥సం,14. 2. 2000
కమలమ్మ- రామస్వామి
సరుబుజ్జిలి-శ్రీకాకుళం

లోకేష్ - భవ్య
5॥సం,14. 2. 1998-4సం॥14.2.1999
శ్రీదేవి- మాధవరావు
చిన్నబరాటంవీధి- శ్రీకాకుళం

జయలక్ష్మి
6సం॥14.2.1997
రంగవేణి- నాగార్జున
డోన్- కర్నూలు

కె. సంజన
1॥సం,14. 2. 2002
స్వప్న-సుధీర్‌రెడ్డి
నకిరేకల్-నల్లగొండ



ఎన్.జోషిబాబు
3॥సం,15. 2. 2000
విజయలక్ష్మి-వెంకట్రావు
పెనుమాక-గుంటూరు

పి.గీతాంజలి
4॥సం,15. 2. 1999
లీలావతి- గిరిబాబు
అనకాపల్లి-విశాఖ

మీ శరీరంలో హెచ్.ఐ.వి. ప్రవేశించిందా? వైరస్‌తో సహజీవనం చేస్తున్నారా? అయినా కంగారు పడకండి. ఆందోళన చెందకండి. నిరాశ, నిస్పృహలకు లోనుకాకండి. కొన్ని ఆరోగ్య నియమాలు పాటించితే... దాదాపు సాధారణ జీవితాన్ని గడిపే అవకాశం మీ చేతుల్లోనే ఉంది. హెచ్.ఐ.వి. పాజిటివ్ వ్యక్తులకు కొన్ని సూచనలు :

మీరు హెచ్.ఐ.వి.తో సహజీవనం సాగిస్తున్నారా?

డాక్టర్ టి.ఎల్.ప్రసాద్

- రోజుకు రెండు సార్లు సబ్బుతో స్నానం చేయండి. దానివల్ల చర్మం శుభ్రంగా ఉంటుంది. జిడ్డును తొలగించినట్లు అవుతుంది. సూక్ష్మజీవుల సంఖ్య తగ్గుతుంది.
- ఉతికి, ఆరేసిన బట్టలనే వాడండి. దీనివల్ల తామర, గజ్జి వంటి అంటు వ్యాధుల వ్యాప్తిని అరికట్టవచ్చు.
- విధిగా చేతిగోళ్ళను, కాలిగోళ్ళను వారానికి ఒకసారి కత్తిరించండి. దీనివల్ల సూక్ష్మజీవులు శరీరంలోకి ప్రవేశించకుండా నిరోధించవచ్చు.
- మల మూత్రవిసర్జన తర్వాత, భోజనానికి ముందు విధిగా చేతులు కడుక్కోవాలి. వ్యాధుల రీఎంట్రీని నిరోధించవచ్చు.
- కాచి చల్లార్చిన నీటినే తాగవలెను. దీనిద్వారా నీటి ద్వారా వ్యాప్తి చెందే వ్యాధులు నిరోధించబడతాయి.
- పచ్చిపాలు, పచ్చిగుడ్లు తీసుకోరాదు. తీసుకుంటే టైఫాయిడ్, షిగెల్లోసిస్, క్షయ వంటి వ్యాధులు వ్యాప్తి చెందుతాయి.
- తినగలిగితే అన్ని రకాల ఆహార పదార్థాలు మితంగా ఎక్కువసార్లు తీసుకోవాలి.
- కుక్కరులో వండిన ఆహార పదార్థాలు వాడడం మంచిది. ఎందువలనంటే అందులో ఆహార పదార్థాలు 160 డిగ్రీల వద్ద ఉడుకుతాయి. ఆ ఉష్ణోగ్రత వద్ద 99 శాతం సూక్ష్మజీవులు నశిస్తాయి.
- ద్రవ పదార్థాలు, పళ్ళు తీసుకోవాలి. వేరుశనగ, చిక్కుళ్ళు, గుగ్గిళ్ళు రోజూ కొద్దిగా తీసుకోవడం చాలా మంచిది.
- చుట్ట, బీడీ, సిగరెట్, పొగాకు నమలడం, గుట్కా వంటి వాటికి, ఆల్కహాల్, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి.
- సాధ్యమైనంత వరకు బస్సులో ప్రయాణం చేయకుండా ఉండడం మంచిది. ఎందువలనంటే బస్సులు ఎప్పుడూ కిక్కిరిసి ఉంటాయి. కనుక ప్రయాణీకుల వ్యాధులు శరీరంలో ప్రవేశించే అవకాశాలు ఎక్కువ.
- క్షయ, డయేరియా, కలరా, మెనింజిటిస్ అంటు వ్యాధుల ఆసుపత్రులకు దూరంగా ఉండడం మంచిది.
- పరిమిత వ్యాయామం, యోగ, ధ్యానం చేయడం ద్వారా మనస్సు నిర్మలంగా ఉండేందుకు దోహదపడతాయి.
- భార్యా, భర్త ఇరువురు పాజిటివ్ అయినా తప్పనిసరిగా నిరోధ్ వాడాలి. ఎందువలనంటే వైరస్ మార్పిడి మరింత అనారోగ్యాన్ని కలిగించవచ్చు. ఒక్కరు పాజిటివ్ అయితే జీవిత భాగస్వామి శ్రేయస్సు కోరి పూర్తిగా సెక్స్‌కు దూరంగా ఉండాలి.
- యాంటీ హెచ్.ఐ.వి. మందులు వాడుతున్నా... మీ ద్వారా వైరస్ వ్యాపించే అవకాశం ఉంది. కనుక మందులు వాడుతున్నామని బాధ్యతలు విస్మరించవద్దు. మీకు వివాహం కానట్లయితే పాజిటివ్ వ్యక్తులనే పెళ్ళి చేసుకోండి. ఈ విషయం దాస్తే అది చట్టరీత్యా నేరమవుతుంది.
- వైద్యుని సలహాతో కొన్ని రకాల వ్యాధులు రాకుండా టీకాలు వేయించుకోవడం మంచిది.
- ఆత్మస్థయిర్యాన్ని కోల్పోకుండా, ముందుకు సాగాలి.
- మీరు పాజిటివ్ అనే విషయాన్ని ఇతరులకు చెప్పాల్సిన అవసరం లేదు. మీతోటి పాజిటివ్స్‌కు మీరు చేయూతనివ్వండి.

తింగ్లీషు

అంపశయ్య నవీన్



హైదరాబాద్‌లో ఉంటున్న మా అమ్మాయి వాళ్ళింటికెళ్ళాం నేనూ, మా ఆవిడ. ఈసారి మా మనవరాలి పుట్టినరోజు పండక్కి ఈ హైదరాబాద్ ప్రయాణం పెట్టుకోవలసి వచ్చింది.

బర్కత్‌పురాలో ఉంటున్న మా అమ్మాయి వాళ్ళింటికెళ్ళి భోజనం చేస్తోంటే స్కూలు నుండి సృజన - అంటే మా ఆరేళ్ళ మనుమరాలు వచ్చేసింది. అప్పుడే నేను "ఆ పచ్చడి కొంచెం వెయ్యమ"ని మా అమ్మాయిని అడుగుతున్నాను.

"పచ్చడంటే ఏంటి మమ్మీ?" అని అడిగింది సృజన. ఆ పసిదానికి పచ్చడంటే తెలీకపోవడం, 'పికిల్' అంటే తెలియడం నన్ను చాలా ఆశ్చర్యపరచింది.

కాస్సేపట్లో మేం భోజనం చేస్తున్న భోజనాల గదిలోకి ఓ పిల్లి వచ్చింది. ఆ పిల్లిని చూడగానే సృజన భయపడిపోతూ వాళ్ళమ్మ ఒడిలో చేరిపోయింది.

"పిల్లిని చూస్తే నీకంత భయమా?" అన్నాను నేను.

"పిల్లంటే ఏమిటి మమ్మీ?" అని అడిగింది సృజన.

"పిల్లంటే 'క్యాట్'" అంది వాళ్ళమ్మ.

"దానికి ఇంగ్లీషు మాటలు తప్ప తెలుగు మాటలు నేర్పించడం లేదా సుజాతా!" అన్నాను మా అమ్మాయి నుద్దేశించి.

"దానికి తెలుగు మాటలు కూడా వచ్చు నాన్నా! కావాలని అదలా అడుగుతోంది" అంది సుజాత.

"నువ్వేమన్నా చెప్పు మీ తల్లులు కూడా పిల్లలకు తెలుగు నేర్పించడం అనవసరం అనుకుంటున్నారు. మొదలు మాతృభాష వచ్చాకే మిగతా భాషలు నేర్పించాలి. మాతృభాషను ఇలా ఉపేక్షించడం చాలా దారుణం" అన్నాను.

"మీరలాగే చెబుతారు నాన్నా! మాతృభాష అంటూ తెలుగే నేరిస్తే రేపు దాని భవిష్యత్తేమి కావాలె. ఇప్పుడు ఎక్కడకెళ్ళినా ఇంగ్లీషే ఇంగ్లీషు. ఏ ఉద్యోగం కావాలని వెళ్ళినా ఇంగ్లీషులో మన ప్రావీణ్యం ఎంత అన్న విషయాన్నే పరీక్షిస్తున్నారు... ఇంగ్లీషు అనేదొక మహాసముద్రం... చిన్నప్పట్నించి నేర్పిస్తేనే ఆ భాష మనకు పట్టుబడ్తుంది. తెలుగుదేముంది? ఎప్పుడైనా నేర్చుకోవచ్చు.. మాతృభాషే కాబట్టి వద్దన్నా వస్తుందది" అంది సుజాత.

దానికి వెంటనే ఏమని సమాధానం చెప్పాలో నాకర్థం కాలేదు.

ఇంగ్లీషు మీద ఇంత వ్యామోహం పెరిగిపోవడం, మాతృభాష మీద ఒక రకమైన ఏవగింపు కలగటం ఆరోగ్యకరమైన లక్షణం కాదు. విద్యాబోధన మాతృభాషలో జరిగితేనే పిల్లలు బాగా నేర్చుకోగలరని భాషా శాస్త్రజ్ఞులు పదే పదే చెబుతున్నారు. మొదలు మాతృభాషలో ప్రావీణ్యం సంపాదిస్తేనే ఇతర భాషల్లో మనకు ప్రావీణ్యత సులభంగా అబ్బుతుంది... అంతేగాని మాతృభాషను కాదని వేరే భాషల వెంట పరుగెత్తగడం ఆత్మహత్యా సదృశం"

"మీరు చెప్పేది వినడానికి బాగానే ఉంది. మాతృభాషల మీద మమకారం ఉండటం మంచిదే కావచ్చు. కానీ మన మాతృభాష ఎక్కడుంది. చెప్పండి? ఏ ఆఫీసుకెళ్ళినా లావాదేవీలన్నీ ఇంగ్లీషులోనే జరుగుతున్నాయి. మీరో అప్లికేషన్ను రాసివ్వాలంటే ఇంగ్లీషులో రాసిస్తేనే దానికేమన్నా విలువుంటుంది - తెలుగులో రాస్తే ఎవరూ పట్టించుకోరు - ఏ విషయాన్ని గూర్చి తెలుసుకోవాలన్నా ఇంగ్లీషులో అడిగితేనే ఆ ఆఫీసువాళ్ళు మిమ్మల్ని సీరియస్‌గా తీసుకొని సమాధానం ఇస్తారు. కంప్యూటర్ యుగం వచ్చాక ఇంగ్లీషు ప్రభావం మరీ ఎక్కువైపోయింది. కంప్యూటర్స్ శిక్షణ పొందాలంటే మీకు ఇంగ్లీషు వచ్చి తీరాల్సిందే. ఇవ్వాళ ఏ యువకుడ్నిగానీ, ఏ యువతి గానీ కదిలిస్తే చాలు ఇంగ్లీషులోనే మాట్లాడతారు. పూర్తిగా ఇంగ్లీషులో కాకుండా మూడొంతులు ఇంగ్లీషుతో ఒక వంతు తెలుగును మిక్స్ చేసి మాట్లాడతారు - ఎవరో అన్నట్టు ఇవ్వాళ్ళ మన తెలుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్‌లోని చదువుకున్న మధ్యతరగతి, ఉన్నత తరగతి కుటుంబాల్లో మాట్లాడబడుతున్నది మన మాతృభాష తెలుగు కాదు. తెలుగింగ్లీషు! ఈ తెలుగింగ్లీషే ఇవ్వాళ సిటీస్‌లో మన యువతరపు మాతృభాష - 'టుమారో నా బర్త్‌డేకు తప్పకుండా రావాలంకుల్!" అంటూ ఆహ్వానించడం, 'డైనింగ్ టేబుల్ మీద అన్నీ అరేంజ్ చేశావా ? నాకు టైమయిపోతోంది. లేట్‌గావెళ్తే మా బాస్ చాలా హ్యుమిలియేటింగ్‌గా మాట్లాడ్తాడు' అంటూ ఓ భర్త భార్యను పురమాయించడం, "సచిన్ టెండూల్కర్ ఇవ్వాళ చాలా సూపర్బ్‌గా ఆడాడు. సింప్లీ ఫెంటాస్టిక్ ఇన్నింగ్స్ ఆడాడు" అని క్రికెట్ ప్రేమికులనడం, "హార్టీ కంగ్రాచ్యులేషన్స్"అని పెళ్ళిళ్ళలో వధూవరుల మీద అక్షింతలు వేసే వాళ్ళు అనడం, ఇక ఈనాటి యువతరానికి అలవాటైపోయిన 'ఫిగర్ బాగుంది' 'లైనేశాడు' 'బీటు కొడ్తున్నాడు' 'అంతసీనులేదు' లాంటి మాటలు... ఇదంతా ఏమిటంటారు? తెలుగే అంటారా? లేక 'తెలుగింగ్లీషు' అంటారా? జన సామాన్యంలోకి ఇంతగా చొచ్చుకుపోయిన ఈ 'తెలుగింగ్లీషు'ను తెలుగు వాళ్ళు ఎలా వదిలించుకుంటారు నాన్నా!" అంది సుజాత.

"నిజమే.. ఇంగ్లీషు మాటలు తెలుగు మాటలతో కలిసిపోయి 'తెలుగుంగ్లీషు' అనే ఓ సంకర భాష ఏర్పడిన మాట వాస్తవమే. కానీ దానికి కారణమేమిటంటావు? మన వాళ్ళకు.. అంటే తెలుగు వాళ్ళకు వాళ్ళ మాతృభాష మీద ఏ మాత్రం కూడా ప్రేమగానీ, గౌరవంగానీ లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణం. మన పక్క రాష్ట్రాలైన 'తమిళనాడు'లోగానీ, 'కర్నాటక'లో గానీ పరిస్థితి ఇంత అధ్వానంగా లేదు. తమిళులు, కన్నడిగులు వాళ్ళ మాతృభాషల్ని గౌరవిస్తారు. ప్రేమిస్తారు. అందుకే వాళ్ళు వాళ్ళ మాతృభాషల్ని ఇంగ్లీషు దాడి నుండి కాపాడుకోగలిగారు. ఇంగ్లీషు భాష కారణంగా ప్రపంచంలో ఎన్నో భాషలు కనిపించకుండా పోయాయి. మాతృభాషల్ని కాపాడుకోవాలన్న చైతన్యాన్ని పెంపొందించుకోవడానికి ఐక్యరాజ్యసమితి వాళ్ళు ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 21వ తేదీన మాతృభాషా దినోత్సవంగా జరుపుకోవాలని ప్రకటించారు. అలానైనా ప్రజలకు మాతృభాష ఆవశ్యకత తెలుస్తుందేమో చూడాలి. కేవలం ఐదు శాతం మంది మాత్రమే మాట్లాడే ఇంగ్లీషుభాషా దుష్ప్రభావం నుండి మన మాతృభాషను రక్షించుకోవడానికి ఓ పెద్ద ఉద్యమమే రావలసిన అవసరముందనిపిస్తున్నది" అన్నాను నేను. ◆

...ల్లో ఏముంది?



దయ్యం

నసీరుద్దీన్‌కి ఒక దయ్యంతో స్నేహం వుందని ఊళ్లో చెప్పుకోసాగారు. ఇంత వరకైతే బాగానే వుండేది. ఈ ప్రచారం ఎంత తీవ్రంగా వుందంటే... 'నసీరుద్దీన్ ఆ దయ్యంతో కలిసి పొరుగు ఊళ్లకు వెళ్తారంట. కలిసి భోజనం చేస్తారంట. కలిసి కబుర్లు చెప్పుకుంటారంట. కలిసి నాటకాలు చూస్తారంట...' ఇలా. ఇదంతా విన్న ఓ వ్యక్తికి ఆ దయ్యాన్ని చూడాలనిపించింది. అనుకున్నదే తడవుగా ప్రయాణమవుతాడు. నడిచీ నడిచీ ఎట్టకేలకు నసీరుద్దీన్ గ్రామం చేరుకుంటాడు. దారి పొడవునా అడుగుతూ నసీరుద్దీన్ ఇంటికి చేరతాడు. ఇంతగా వెళ్తే... అక్కడ నసీరుద్దీన్ లేడు. పొరుగూరు వెళ్లారని ఆయన భార్య చెప్తుంది. సాయంత్రం వస్తారని కూడా చెప్తుంది చల్లగా. అతగాడికైతే పైప్రాణాలు పైనే పోతాయి. తన అనుమానం నివృత్తి చేసుకోవాలంటే వుండాలి. అక్కడ వుండాలంటే నసీరుద్దీన్ మిత్రుడైన ఆ దయ్యం వచ్చి ఆట పట్టిస్తాడేమోనని భయం. ఏదైతే అదైందని సాయంత్రం వరకు వుంటాడు. ఎట్టకేలకు నసీరుద్దీన్ వస్తాడు. వచ్చీరాగానే తన అనుమానం బయటపెడతాడు. 'నసీరుద్దీన్! నీకు ఓ దయ్యం స్నేహితుడు వున్నాడటకదా. ఎలా వుంటాడు?' అని. దానికి నసీరుద్దీన్ నవ్వుతూ...'ఏం లేదు మిత్రమా! ఒక అద్దం తీసుకో. అందులో చూడు. దయ్యం కనిపిస్తుంది' అని చెప్పాడు. అంతే ఇహ ఆ వ్యక్తికి మాట రాలా.

కలం స్నేహం

...శాంతి
...13 సం॥
...7వ తరగతి
...టీవీ చూడడం, చదువుకోవడం, స్కిప్పింగ్ , టెన్నికాయిట్
...నామా : పి.శాంతి, డాటరాఫ్ యానాదిరావు, 2వ వార్డు, ...ట, గాంధీనగర్, చీరాల.

...రామకృష్ణ
...14 సం॥
...వ తరగతి
...థలు, పేపరు చదవడం
...నామా : వి.రామకృష్ణ, గౌతమి హైస్కూల్, శాంతినగర్, నల్లగొండ.

...ంకర్‌నాయక్
...9 సం॥
...వ తరగతి
...దవడం, ఆటలు ఆడడం, పాటలు పాడడం, లీడర్‌గా వుండడం
...నామా : బి.శంకర్‌నాయక్, సన్నాఫ్ రెడ్డినాయక్, అక్కారం, ..., మహబూబ్‌నగర్.

పదాల పదనిసలు

క	?
దే	
భా	
మా	
తా	
రా	

ఒక్క అక్షరం కలపండి

గతవారం జవాబులు

షా	ట్టు
పా	
కో	
మా	
స్టో	

చక్రం తిప్పండి!

హాయ్...

పక్కన ఒక బండి చక్రం వుంది కదా. దాన్ని గిరగిరా తిప్పుతూ చూడండి. ఏం కనిపించింది? పది పైసల నాణెంలాంటిది దానిలో తిరుగుతూ కనిపిస్తోందా! అదీ ఈవారం మేజిక్. గతవారం గీతల్లో వున్న వాక్యం ఏంటో తెలిసిందా? తెలిసే వుంటుందిలే. అయినా చెప్తున్నా... ఐ లవ్ మేథమాటిక్స్ అండ్ సైన్స్.

మేజిక్! మేజిక్!!



రుక్మిణి

చలికి నరాలూ.. ఆకలికి పేగులూ జివ్వుమని గుంజి పారేస్తున్నాయి. కుక్కలేదు గాబట్టి సరిపోయింది. ఆ పాలరాతి వరంగా మెట్ల మీద కూలబడి వ్య.భిక్షగాడు 'హమ్మయ్యా' అని ఓ మూలుగు మూలిగాడు - వాడికి సరిగా లెక్కలు రావు గనక ఆ కడుపు నింపి ఎన్నాళ్ళయిందో నిక్కచ్చిగా చెప్పలేడు గదా! మూలుగుడేనాయె! ఈ భవంతి మారాజులు కరుణిస్తే 'ఉపవాస దీక్ష విరమణ' అనుకునేంతలో తలుపులు భళ్ళున తెరుచుకుని అద్వానంగారు ఆదరాబాదరాగా వచ్చి అక్కడి ఓ మెత్తటి సోఫాలో కూలబడి సుతిమెత్తంగా పలకరించాడు!

"చ్చొ... చ్చొ... ఎవరయ్యా నువ్వు.. ఏంటి నీ కథా... వ్యధా... చెప్పు...!" ఆయనగారు అట్లా అడిగేసరికి వ్య.భిక్షగాడి లోతు కడుపులోంచి ఆశ చిగురుటాకులు వేసి లేని ఓపిక తెచ్చుకుని కూర్చుండి ఎగశ్వాస పీకి వదిలాడు.

"చెప్పడానికే వుంది.. మేం రైతులం.. అబ్బో... ఈ కరువు దెబ్బకు కకావికలమై కంటపడ్డ దోవల వెంటబడ్డం.. అబ్బో... రాకాసి కరువు...!" మూలిగాడు... అద్వానంగారు మరీ అద్వానంగా కండ్లు మిటకరించాడు.

"టట్టట్టట్ట... కరువును తక్కువ చేసి మాట్లాడుతున్నావ్! అది విశ్వవ్యాపితం... ఈనాడు మార్కెట్లో వినియోగదారుల కరువేర్పడి ఉత్పత్తుల అమ్మకాలకు కరువేర్పడింది. విదేశీ మార్కెట్లకు కరువేర్పడడంతో మారక ద్రవ్యం కరువు ఏర్పడింది. దేశంలో ఉగ్రవాదుల దెబ్బకు 'శాంతి'కి కరువేర్పడింది. అయ్యో-" ఆయనగారి హావభావాలు చూసి భిక్షగాడు హడలిపోయి... ఆయనగారి చిరునవ్వు చూసి స్థిమిత పడ్డాడు - కడుపులో పేగులు అలిసిపోయి గుర్రుమనడం మానేశాయి.

".... పైగా ఆదిమ సమాజం నుండీ.. ప్రకృతిలో అన్నీ కరువే! త్రేతాయుగం నుండీ అంతటా అన్నిటికీ కరువేనాయె!"

కలియుగంలో ఆంధ్రరాష్ట్రంలో తాను ఆకలికి నకనకలాడుతుంటే - త్రేతాయుగం... ఆదిమ గుహలూ అజంతా చిత్రాలంటాడు! ఏది అన్నా చివరికి ఈ కడుపు నింపేసుకునేసాయం దొరుకుద్ది కదా అని ఊపిరి బిగబట్టి మరో మూలుగు మూలిగాడు!

"ఏంటో సామీ... ఈ బాధలు పడలేం.... అట్లా పడలేకనే చాలామంది మా రైతులు ఆత్మహత్యలకు తెగబడిపోతున్నారు. ఉరితాడో... వుండోసల్ఫానో... గటుక్కున మింగి పైకెగిరి పోతున్నారాయె!" దిగులు పడుతూ అన్నాడు - ఆయనగారు ఎట్లాగూ 'ఆత్మహత్య మహాపాతకం... తప్పుసుమీ' అంటాడనుకుంటే - ఆయనగారి మాటలతో అధాటున డొక్కలో బాంబు పేలినట్లు ఝడుసుకుని ఆకలిమాట ఆ అదురుకు అప్పటికి మరిచిపోయాడు !

"చ్చొ... చ్చొ... చ్చొ... ఆత్మహత్యలు... చాలా సహజం... 'జాతస్యమరణం ధృవం' అసలు ఆత్మహత్యలు మన సంస్కృతిలో... చరిత్రలో ఒక భాగం... పైగా విధి వక్రించిన నాడు అట్లా చేసుకోనివాడే మహాపాపి! మహాప్రపంచ దిశానిర్దేశకుడు శ్రీమాన్ హిట్లర్‌గారే ఆత్మహత్య చేసుకుని ఆదర్శ పురుషుడయ్యాడు - అది చరిత్ర చెబుతున్నసత్యం! అసలదినేరమూ కాదు... ఘోరమూ కాదు...

అట్లా ఆయనగారు 'ఆత్మహత్యల పురాణం'తో బాటు 'సతీసహగమనం' ఎంత సహజమో... ఎంత పవిత్ర కార్యమో... టీకా తాత్పర్యాలకు తగులుకోవడంతో వ్య.భిక్షగాడి కడుపు ఈసారి క్రోధంతో భగభగమండిపోయింది. ఎక్కడా లేని మొండితనం.. తెగింపూ ఒక్కసారే వచ్చి కూర్చున్నాయి!

"అదే... అదే... ఆత్మహత్యలే కాదు సారో... జనం ఈ వత్తిడికి తట్టుకోలేక హత్యల్లోకి కూడా దిగిపోతున్నారు - కత్తితో కసుక్కో... రోకలిబండతో లటుక్కో... బాంబులతో బదాబదలుగా బాదుకుంటున్నారు - అంతే!" కసికసిగా అన్నాడు.

"చ్చొ... చ్చొ... సింపుల్! అది సృష్టి

వినోదం... సంభవామి యుగే.. యుగే...పాపం పెరిగినపుడు పరిహారార్థం ఒకడినొకడు చంపుకుని సమాజ సమతుల్యతను కాపాడవలె! అతి జనాభా పెరుగుదల మిక్కిలి ప్రమాదకరం! అది ఏదో ఒక రూపేణా ఆ విధి విధాత చెకింగ్ చేసి పారేస్తున్నాడు. యుద్ధాలు.. రణరంగం.. చరిత్రతో వీరంగం ఇదంతా మంచి సంప్రదాయం - మన మూలాలు వికసించేది ఇందులో నుండే...

ఆయనగారు చల్లగా.. బహుక్రూరంగా లొడలొడా లగాయించేస్తుంటే భిక్షగాడు పండ్లు పటపటనూరాడు. అప్పటికి బాగా చీకటి పడిపోయింది - అప్పటికే రెండుసార్లు 'ఆశ' చాలించుకుని ఈ 'పీడ' వదిలించుకుందామనుకుంటే కళ్ళతోనే వారిస్తాడాయె! పోనీ... హత్యలు సహజంగదా! ఉన్న బలాన్నంతా కూడదీసుకుని నక్కలా ఒక గెంతు గెంతి వాడి మెడ దొరకబుచ్చుకుని కసపిస కొరికి చంపి పారనూకితే.. తల గోడకేసి బాదితే... ఈ చచ్చు పురాణం... మీమాంస... పులుసులోకి లేకుండా పోతాయి గదా అని అటు ఇటు వీలుగా సర్దుకున్నాడు.

"అదీ... అది చరిత్ర... బలం...ఆయుధం... అమెరికా... దాడులు... శవాల గుట్టలు... పీనుగులు... అరరె... ఎవరయ్యా నువ్వూ.. రా బాబూ రా... అట్ల కూర్చో... చదువుకున్న వాడిలా వున్నావ్... రా... చీకటి పడ్డాక ఇట్లా వచ్చావ్..."

• వ్య.భిక్షగాడు అధాటున దూకబోయిన వాడల్లా తమాయించుకుని - వెనక్కి తగ్గి మెడతిప్పి చూశాడు. ఓ యువకుడు... పాతపాంటూ.. మాసిన చొక్కా.. తలా... గడ్డం.. కండ్లు రుముతూ వచ్చి పక్కనే కూలబడిపోవడంతో... ఓ వేడి శ్వాస వదిలి 'నక్కలా మీదికి దూకడాన్ని' తాత్కాలికంగా వాయిదా వేసుకున్నాడు వ్య.భిక్షగాడు.

"మీ రైతుల బాధలు మాకు తెలుసు... మీ ఆకలి తెలుసు.. ఓపిక పట్టాలి - మొత్తానికి మొత్తం దేశంలోని నదులన్నీ సర్వే చేద్దాం... చిన్నా చితకా ముప్పయి దాకా వున్నాయి గదా... వాటన్నింటికి కలిపి ఒకే సొరంగంలో నుండి వచ్చే నీటి పథకం తయారు చేస్తున్నాం! మరో పాతికేళ్ళలో పూర్తి చేస్తాం - తర్వాతిక సమస్యలుండవ్! నీరే నీరు - పంటలే పంటలు... ప్రపంచ బ్యాంకుంది... అప్పులున్నాయి.. ఫర్వాలేదు!"

అప్పుతెచ్చె - వడ్డికట్టె - కడుపుకొట్టె - అని తగులుకోడంతో వ్య.నీరుగారి కుంచించుకుపోయాడు - ఈ వెధవ భాగోతం వింటానికా తాను చెవులప్పజెప్పింది.

"సార్.. నేను వీధుల వెంటబడి ముష్టెత్తుకుంటున్నాను.. అడ్డగాడిదలా రోడ్లు... మార్కెట్లు... ఆఫీసులు... చెప్పులూ.. కాళ్ళూ రెండూ అరిగి ఆనమాల్లేకుండా పోయాయి - అబ్బా"! యువకుడు ఆయాసపడుతూ అన్నాడు!

"చ్చొ... చ్చొ.. జీవితంలో ముష్టి తప్పనిసరి! వ్యష్టి జీవితాలలో రూపం మారిన అప్పు అనివార్యం -గాడిద కన్నా దాని కాళ్ళు పరమ పూజ్యం. అది ఎంత తిరిగినా అరిగి చావవు"

యువకుడు అచేతనంగా ఆయనగారి వంకే బిక్కచచ్చి చూశాడు!

"మాలాంటోళ్ళం చదివి... చదివి డిగ్రీలు సంపాదిస్తిమి. అప్పులు చేస్తిమి. ఎవడికీ ఎక్కడా ఏ ఉద్యోగమూ దొరక్కపోయె! పైగా వున్న ఉద్యోగులందరినీ పీకి పారేస్తే వాళ్ళూ మాతోనే కలిసి తిరుగుడాయె! ఏడాదికి కోటి ఉద్యోగాలని ఆశపెడితిరి. ఏవీ..." ఆవేశంగా అరుస్తున్న యువకుని వంక అద్వాన్నంగారు జాలిగా అద్వాన్నంగా చూశారు.

"అరె తెలివితక్కువ మేళం... బుర్రల్లేవు - ఉద్యోగానికీ... ఉపాధికీ తేడాలు వెతికితే ఇక బతికినట్లే" అద్వాన్నంగారి మాటలకు యువకుడు నోరు బార్లా తెరిచాడు.

"అరె అబ్బాయ్ - దేశంలో కోట్ల మంది నిరుద్యోగులకు ఎన్నో ఉపాధి పథకాలు తగిలించాం - అటు వాల్మీకి యోజన కింద గృహ నిర్మాణ పరిశ్రమ - భారీగా గ్రామీణ రహదారుల కొనసాగింపు.. ఇంకా మొత్తానికి మొత్తం టెలికం వ్యవస్థను అనుసంధానం చేసి ఉపాధి అవకాశాలను అందిస్తున్నాం గదా!"

"అంటే - రోడ్డు కూలీలూ... భవన నిర్మాణంలో ఇటుకలు మోయటం... స్తంభాలకు గోతులు తవ్వడం.. హవ్వ... బిటెక్-ఇంజనీరింగు - కంప్యూటరు-ఎం.ఏ. ఎమ్మెస్సీలు.. హమ్మో... అంటే మా చదువులన్నీ... వీటిరూ... ఈ ఉపాధికే..." యువకుడు బేజారుగా మూర్ఛలోకి జారాడు.

"థు... నీ... మా రైతులు సల్లంగుంటే గీపన్లు ఈ పోరగాండ్లకు మేమే చూపిస్తాం. ఉపాధి... బాగుంది. మరింక ఈ బళ్ళూ - కాలేజీలు మూసిపారేయక... థు..."

వ్య.ధుమధుమలాడుతూ అప్పటికి తన ఆకలిని మరిచి రోడ్డుమీద పడతుంటే తన 'సోది' వినేవాడు దొరక్క అద్వాన్నం నుదురు బాదుకున్నాడు.! ◆

లక్ష్మి

పండుగల సంఖ్య మనకి ఎక్కువగానే వుంది. పండుగ పేరిట ఉన్నవాళ్లు ఉత్సాహంగా రెచ్చిపోతుంటారు. లేనివాళ్లు ఎంతగొప్ప పండుగొచ్చినా పట్టించుకోరు. కేలెండరు నిండా పండుగలుంటే బావుండని అదృష్టవంతులు కొందరనుకుంటే – ఎందుకీ దండగ పండుగని కొందరు భావిస్తారు. ఆదివారం నాడు ఏ పండుగొచ్చినా ఒక సెలవు దినం ముదనష్టమైందని ఉద్యోగస్థులు తప్పకుండా అనుకుంటారు. మొన్న రిపబ్లిక్ దినోత్సవం గురిచూసి ఆదివారం నాడే వచ్చినందుకు చాలా మంది విసుక్కున్నట్లు తెలిసింది. సోమవారం వచ్చివుంటే – వరసగా రెండు రోజులు సెలవలొచ్చును గదా అని అధిక సంఖ్యలో మగవారు నసిగినట్టు కూడా తెలిసింది. ఆడవాళ్లు మాత్రం ఆనందిస్తారని నాకు తెలుసు. పండగొస్తే పచ్చడయ్యేది ఆడవాళ్లే! ఇంటో కూచున్న మగాళ్లు బుద్ధిగా వుండరు. అరగంటకో తడవ కాఫీ ఏర్పాట్లు చూడమంటారు. గంటకోసారి తినుబండారాల కోసం ఆర్డర్లు వేస్తారు. అంచేత సెలవు రోజు ఆడవాళ్లకి మిగతా రోజులకంటే ఎక్కువగానే పని తగుల్తుంది! పిల్లలూ పెద్దలూ ప్రాణాలు తీస్తారు. పండుగ ఆదివారం నాడు వస్తేనే ఆమెకు తృప్తిగా వుంటుంది. ఆదివారం నాడు ఎట్లాగూ నడ్డివిరిగే పని వుండనే వుంటుంది. ఆ వచ్చే పండుగ ఆదివారం నాడు వస్తే పనిలో పనిగా కొట్టుకుపోతుంది!

డవుటు తొలిగిందా?

పండుగల గురించి రాయాలని నా ఉద్దేశం కాదు. పండుగ నాడు ఆడవాళ్లకి పనెక్కువగా వుంటుందనే చిన్న ఆలోచనతో ఇంత ఉపోద్ఘాతం తయారయ్యింది. గడిచిన జనవరి నెలంతా సంక్రాంతి సంబరాలతో గడిచిపోయింది. ఇంటిపనుల వత్తిడితో ఆడవాళ్లు ఎంత అలిసిపోయేరో వాళ్లకే తెలుసు! చాకిరీ చేయించుకున్న మగాళ్లకేం తెలుసు? కొత్త అల్లుళ్ల రాకతో అత్తమామలు అల్లాడిపోయి వుంటారు. విడిచిపెట్టండి. ఒక్కో పండక్కి ఒక్క లక్షణం. దీపావళి నాడు ప్రతి వీధీ టపాసుల మోతలతో, మతాబుల వెల్తుర్లతో నిండిపోతుంది. దసరా సరేసరి. పులివేషాలూ, బొమ్మల కొలువుల్తో హడావిడిగా వుంటుంది. వినాయకచవితి పట్ల నాకు అపారమైన భయభక్తులున్నాయి. అన్ని పండుగలూ ఒక ఎత్తు – వినాయక చవితి ఒక్కటే ఒక్క ఎత్తు. ఆ రోజు ధైర్యంగా తలెత్తుకు తిరగడానికి వీల్లేదు. పొరపాటున చందమామని చూస్తే – ఆ ఏడాది పొడుగునా నెత్తిమీద నిందలు పడతాయనే భయం కారణంగా తలొంచుకు నడవాల్సి వస్తుంది! అవుట్‌డోర్లో చందమామను చూస్తూ పొయిట్రీ రాసే కవులు సైతం వినాయక చవితి నాడు కలాలకు సెలవిచ్చి – చందమామక్కనిపించకుండా ఇంట్లోనే దాక్కుంటారు! చవితి నాడు చందమామను చూడనేల? చూసిన పాపానికి నిందలు మోయనేల అనే సిద్ధాంతానికి మగమారాజులు కట్టుబడి వున్నారు. అంచేత వినాయకచవితి నాడు వారు ఇల్లు విడిచి వెళ్ళరు. వెళ్లినా తలొంచుకు నడుస్తారు!

నిందలంటే మగవాళ్లకి అంతభయం. ఆడవాళ్లకి మాత్రం చవితీ చందమామలూ అనే నిబంధనలుండవు! ఆ మాటకొస్తే వారికి ప్రతిరోజూ చవితే – చంద్రదర్శనమే! అందుకే పలు నిందలు భరించడం ఆడవారి హక్కుగా నిలిచిపోయింది. అంచేత ఆడవాళ్లు ప్రత్యేకించి చవితి నాడు చందమామను చూడకూడదనే నిబంధన ఏదీలేదు. చందమామతో పని లేకుండానే – ఆడవాళ్లకీ అపనిందలకీ అవినాభావ సంబంధం ఎంతో వుంది! ఈ తతంగం నిన్నమొన్నటి నుంచి జరుగుతున్నది కాదు. పురాణ కాలంలో కూడా విచ్చలవిడిగా రాజ్యం చేసింది. ఎవడో ఏదో అన్నాడని శ్రీరామచంద్రమూర్తి సీతమ్మ వారిని అడవులకు పంపించేడు. అంతటి అవతార పురుషుడే అపనిందకి గజగజలాడిపోయి మహాతల్లిని అడవుల పాలు చేయగా – మానవ మాత్రులం మనమెంత? ఇక్కడ మరొక పాయింటు ముచ్చటించుకోవాలి. అపవాదుకి అడవుల పాలైంది సీతమ్మ. ఆ అపవాదులో ఎంతబలముందో, ఎంతవరకు నిజమో వాకబు చేయకుండా – ఆ తల్లిని అడవుల పాలు చేసినందుకు రామయ్య తండ్రి ఆదర్శ పురుషుడయ్యేడు! మగాడంటే ఈ లక్షణాల్తో వుండాలనే థియరీకి మూలపురుషుడయ్యేడు! ధర్మ ప్రభువని బిరుదు సంపాయించుకున్నాడు. మరోపక్క – సీతమ్మని మరిచిపోతే కళ్ళు పోతాయనే పాపభీతితో – ఆతల్లి చిత్రపటమ్ముందు నిలబడి – నన్ను క్షమించు సీతా అని సీస పద్యాలు చదివేడు. దటీజ్ మగమారాజు!

తన నెత్తిమీద కీర్తి కిరీటం పెడతామంటే – మగమనిషి ఎంత కిరాతకానికైనా సిద్ధమంటాడు! తన కీర్తి కాంక్షముందు – కన్న తల్లీ, కట్టుకున్న భార్యా ఆప్తరాలవుతారు. అది వారి లక్షణం! నాటి శ్రీరామచంద్రమూర్తి వారసులే ఈనాటి హీరోలు! ఎవడో యువకుడు ఎవరిల్లో వెతుక్కుంటో ఒక ఇంటిముందు ఆగుతాడు. తలుపు తడతాడు. ఆమె తలుపు తీస్తుంది. ఫలానా వారిల్లు ఎక్కడ అని ఆ యువకుడు అడుగుతాడు. తెలిస్తే చెబుతుంది. తెలీకపోతే పక్కవీధిలో కనుక్కోండని సలహా ఇస్తుంది. చుట్టుపక్కల వాళ్లు ఆ డైలాగులు వినిపించుకోరు. వాళ్ళు దూరంగా వుండటం వల్ల వినిపించవు. అంచేత వాళ్ళు దృశ్యం మాత్రమే చూస్తారు. చూసిన దృశ్యానికి – వాళ్లకి వాళ్ళే స్క్రీన్‌ప్లే అల్లుకుంటారు. డైలాగులు రాసుకుంటారు. ఏతావాతా ఒక నీచమైన కథ నీటుగా తయారవుతుంది! ఆ కథ అంచెలంచెలుగా భర్త చెవిన పడుతుంది!

అంతే! ఆ కథ వినగానే భర్తగారు బిగుసుకుపోతాడు. బ్లడ్‌ప్రెషర్ పెంచుకుంటాడు. గుప్పెట బిగిస్తాడు. పళ్ళు కొరుక్కుంటాడు. అంతే తప్ప – నిజం తెలుసుకునే ప్రయత్నం ఆనాడు రామచంద్రుడు చేయని కారణంగా – ఈనాడు ఈ హీరో కూడా చేయడు. కనీసం ఆ కుర్రాడెవరని కూడా ఆమెను అడగడు. ఎంతైనా శ్రీరామచంద్రమూర్తి వారసుడు గదా! ఆ లక్షణాలు ఎక్కడికి పోతాయి? ఆ రోజుల్లో అపనిందల పాలైన ఆడవాళ్లని అడవులకు పంపించే ఆచారముండేమో? ఇప్పుడది చెల్లుబడి కాదు గనక ఆమెను అనుక్షణం అనుమానించడం ప్రారంభిస్తాడు. ఆమె మీద నిఘా ఏర్పాటు చేస్తాడు. ఆమెకు తెలీకుండా ఆమెను నీడలా వెంబడిస్తాడు. ఆమె పేరంటానికి వెళ్ళినా, కూరలు కొనేందుకు ఇల్లు విడిచినా – ఆమెకు కనిపించకుండా ఆమెను ఫాలో అవుతుంటాడు. ఆఫీసుకి వెడుతున్నానని చెబుతాడు. అడుక్కునే వాడి వేషంలో తిరిగొచ్చి తన ఇంటిముందే తిష్టవేస్తాడు. ఇన్ని పిచ్చి వేషాల్తో అల్లాడి పోతున్నందుకు బాధపడడు. సిగ్గుపడడు. ఆ విధంగా పాతికేళ్లు శ్రమపడినా అలిసిపోడు! ఆ తర్వాతయినా తన మెదళ్లో గూడుకట్టుకున్న డవుటు అవుటైపోతుందాని అడగండి. సరైన సమాధానం చెప్పడానికి మరో పాతికేళ్లు టైమివ్వమంటాడు! అదీ కథ! మగమారాజు కథ!

◆

రమణీయం అనంతగిరి

రవీందర్

పక్షుల కిలకిలలు... సెలయేటి గలగలలు.. పచ్చనిచెట్లు.. ఎత్తైన కొండలతో మైమరిపించే ఆహ్లాదకరమైన వాతావరణంలో ప్రకృతి రమణీయతతో అందరికీ కనువిందుగా కనిపించే ప్రదేశం అనంతగిరి కొండలు. వికారాబాద్ పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ అనంతగరి కొండలు అందరినీ ఆకర్షించే విధంగా కమనీయంగా ఉన్నాయి. ఈ కొండలలో కొలువుదీరిన శ్రీ అనంత పద్మనాభస్వామిని దర్శించడానికి వికారాబాద్ చుట్టుపక్కల ప్రజలే కాకుండా ఇతర జిల్లాల నుండి కూడా వస్తుంటారు. ప్రతి ఏటా ఆషాఢ శుద్ధ ఏకాదశి నుండి పౌర్ణిమ వరకూ అయిదు రోజుల పాటు ఇక్కడ జాతర ఉత్సవాలు జరుగుతాయి. ఈ ఉత్సవాల్లో రంగారెడ్డి జిల్లాకు చెందిన వారే కాకుండా హైదరాబాద్, మహబూబ్‌నగర్, మెదక్ జిల్లాల నుండి, కర్ణాటక, మహారాష్ట్రల నుండి భక్తులు వస్తుంటారు. దశమి నుండి పంచమి వరకు 11 రోజుల పాటు పెద్ద ఎత్తున నిర్వహించే జాతరకు వేలాది మంది భక్తులు వస్తారు. ఎత్తైన కొండల మధ్య చుట్టూ పచ్చని చెట్లతో ప్రశాంత వాతావరణంలో ఈ దేవాలయం ఉంది. ఏడాదికి రెండుమార్లు ఇక్కడ ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ దేవాలయానికి సుప్రసిద్ధమైన చరిత్ర ఉంది. ఈ అనంతగిరి గుట్టలలో వెలసిన శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి దాదాపు 1300 సంవత్సరాల నాటి చరిత్ర ఉన్నదని పలువురు అంటున్నారు. ఆ కాలంలో ఈ ప్రాంతమంతా దట్టమైన అడవులు, కొండలు గుహలతో ఋషులు తపస్సు చేసుకోవడానికి వీలుగా ఉండేదని ప్రతీతి. ఇక్కడ ముచ్చుకుంద నది ఉన్నదనీ, దానిలో స్నానం చేస్తే కోరికలు తీరుతాయని నమ్మకం. సుప్రసిద్ధ చరిత్ర కలిగిన శ్రీ అనంత పద్మనాభస్వామి దేవాలయాన్ని ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దనున్నది. ఆలయానికి చెందిన 80 ఎకరాల్లో పూలతోటలు వేసి సుందరంగా తీర్చిదిద్దనున్నారు. పర్యాటక కేంద్రం పనులు కొనసాగుతున్నాయి.

అనంతగిరి కొండల అంచున ఉన్న అనంతగిరి పల్లె ప్రకృతి రమణీయ దృశ్యాలతో అలరారుతున్నది. సుందర ప్రదేశంలో వెలసి ఉన్న శ్రీబుగ్గరామలింగేశ్వరుడు భక్త జనుల పాలిట కామధేనువు అనేది పరిసర ప్రాంతాల ప్రజల నమ్మకం. స్వామి వారి గర్భగుడి కింద నుండి పెల్లుబికి వస్తున్న నీరు కోనేరులో కలుస్తుంది. అందులో స్నానాలు ఆచరించిన వారికి సమస్త రోగాలు తొలగి పోతాయన్నది భక్తుల నమ్మకం. పూర్వం శ్రీరామ చంద్రుడు రావణ వధ అనంతరం బ్రహ్మ హత్య దోష నివారణ కోసం ఈ దండకారణ్య ప్రాంతంలో శివలింగ ప్రతిష్టలు చేస్తూ అయోధ్య కేగినట్లు పెద్దల ఊహ. అందులో భాగంగానే ఈ అనంతగిరి కొండలో సంచరిస్తూ ఉండగా దప్పిక వేసిన శ్రీరామచంద్రుడు గంగను ప్రార్థించి బాణం వేయగా భూమినుండి పాతాళ గంగ పెల్లుబికి వచ్చి శ్రీరాముని దప్పిక తీర్చిందని ఇక్కడి వారి నమ్మకం. అప్పుడాయన ఒక శివలింగాన్ని ప్రతిష్టించి ఆ గంగా జలంతో అభిషేకించి తరించాడని ఇక్కడి జనుల నాలుకల్లో నానుతున్న స్థల పురాణం. గంగ పెల్లుబికిన ప్రాంతం కనుకనే ఈ ప్రదేశానికి గంగవరమని, అనంతుడైన శ్రీరామచంద్రుడు సంచరించినందున ఈ కొండను అనంతగిరి కొండలని పిలుస్తారు. విశ్రాంతి తీసుకున్న గూడెం కనుక రామయ్య గూడెమని ఈ పరిసర ప్రాంతాలకు పేరువచ్చిందని ఇక్కడి వారి నమ్మకం.

అనంతగిరి గుట్టలు అంటే గుర్తుకొచ్చేది గుట్టలు, ప్రకృతి అందచందాలు. ఇక్కడి గుట్టలు కనువిందు కలిగించే వన్యప్రాణులకు ఆలవాలమై ఉన్నాయి. సెలయేటి గలగలలు, పక్షుల కిలకిలల నడుమ వన్యప్రాణులు సంచరిస్తుంటాయి. విలువైన అటవీ సంపదకు, చిన్నచిన్న వన్యప్రాణులకు ఇక్కడ కొదవలేదు. నెమళ్లు, దుప్పులు వంటి వన్యప్రాణులతో పాటు క్రూరమృగాలు, కొండచిలువలు ఉన్నాయి. టేకు, వెదురు మొదలైన అటవీ సంపద విస్తారంగా ఉంది. రంగారెడ్డి జిల్లాలో కనువిందు చేసే ఈ అభయారణ్యం దాదాపు 1325 హెక్టార్ల వైశాల్యంలో వ్యాపించి ఉన్నది. ఈ అభయారణ్యం పూడూరు, వికారాబాద్ ప్రాంతాల మధ్య ఉంది. వన్యప్రాణుల సంరక్షణ తక్షణ కర్తవ్యమని భావించి ఎట్టకేలకు అనంతగిరిలో వన్యప్రాణి సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

పర్యాటకులకు సమగ్ర అవగాహన, వన్యప్రాణులకు తాగునీరు, ఆహారం, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పవచ్చు. ఇక్కడ ఏదో ఒక చెట్టు మూలంగా టీబీ వ్యాధి పోతుందని గ్రహించి ప్రభుత్వం ఇక్కడ ఒక టీబీ ఆసుపత్రిని నెలకొల్పింది. దీంతో ఇక్కడికి అనేక మంది టీబీ వ్యాధిగ్రస్తులు వస్తుంటారు. ప్రకృతి సోయగాలతో అలరారే అనంతగిరి కొండలను పర్వత కేంద్రంగా తీర్చిదిద్దే ప్రక్రియకు శ్రీకారం చుట్టారు.

సుమారు 400 ఎకరాల స్థలంలో అన్ని హంగులతో రిసార్ట్‌ను నిర్మించాలన్న ప్రతిపాదన కార్యరూపం దాల్చాల్సి ఉంది. రాష్ట్ర రాజధానికి 75 కిలో మీటర్ల దూరంలో చల్లని వాతావరణంలో అనంతగిరి కొండలు ఉన్నాయి. ఇక్కడ శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయం, బుగ్గరామలింగేశ్వరాలయం ఉన్నాయి. మూసీనది పుట్టుక కూడా ఇక్కడే. చారిత్రక ప్రాశస్త్యం కలిగిన ఈ ప్రాంతం కనువిందు గొలిపే ప్రకృతి దృశ్యాలకు ఆలవాలం. హైదరాబాద్‌తో పోలిస్తే ఇక్కడ నాలుగు డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. దీంతో అన్ని కాలాలలోను ఈ ప్రాంతం ప్రశాంతంగానూ, చల్లగానూ ఉంటుంది. ఈ ప్రాంతాన్ని పర్యాటక కేంద్రంగా మార్చాలని ప్రజలు కోరుతున్నారు. ◆



అనంతగిరి హరిత వనాలు

ప్రపంచ కప్ 'పరీక్ష'

- ఎం.డి. హసన్ షరీఫ్

నాలుగేళ్ల నుండి ఆసక్తిగా ఎదురు చూస్తున్న ప్రపంచ కప్ క్రికెట్ ఛాంపియన్‌షిప్ ప్రారంభమైంది. దేశంలో క్రికెట్‌కు చాలా మంది అభిమానులు ఉన్నారు. వివిధ కంపెనీలు ప్రకటనలు గుప్పిస్తున్న క్రికెట్ బొనాంజాతో క్రికెట్ జ్వరం అభిమానులను నెల రోజుల క్రితమే ఆవహించింది. ముఖ్యంగా యువజనులకు, విద్యార్థులకు క్రికెట్‌పై అత్యధిక మోజు ఉంది. కానీ వారు ఈ ప్రపంచకప్‌ను అమితానందంతో ఆస్వాదించలేకపోవడానికి పరీక్షలు అడ్డంకిగా నిలిచాయి. పరీక్షలు సమీపించినందున తాము అర్ధరాత్రి వరకూ చదువులోనే నిమగ్నమవ్వాల్సిన స్థితిలో ఉన్నామని సిఆర్‌పిఎఫ్ స్కూల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న ఆకాశ్ ఖన్నా అనే విద్యార్థి అన్నాడు. "కానీ క్రికెట్ వద్దకు వచ్చేసరికి అన్ని విషయాలూ తెరవెనకకు వెళ్తాయి. సచిన్, సెహవాగ్‌లు కొట్టే బౌండరీలు, సిక్సర్లను చూడకుండా ఎవరు మిస్ చేయాలనుకుంటారు?" అని ఆకాశ్ ప్రశ్నిస్తున్నాడు.

సెంట్ ప్యాట్రిక్స్ హైస్కూల్లో చదువుతున్న సునీల్, కిరణ్‌లు ప్రపంచ కప్‌ను తిలకించడానికి ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకున్నారు. "నేను స్కూల్ ఎగ్గొట్టడానికి కూడా సిద్ధమే. ప్రపంచకప్ నాలుగు సంవత్సరాలకు ఒకసారి మాత్రమే వస్తుంది. ఈ మెగా టోర్నీని మిస్ చేస్తే నా అంత ఫూల్ మరొకరు ఉండరు" అని కిరణ్ అన్నాడు. అతను భారత జట్టు టీ షర్టు కొనే ప్రయత్నాల్లో ఉన్నాడు. భారత ఆటగాళ్లలో ఎవరైనా బౌండరీ కొట్టినప్పుడు, లేదా వికెట్ తీసినప్పుడు గంగూలి మాదిరిగా తన టీ షర్టును విప్పి గాల్లోకి గిరాటేయాలనే ప్రయత్నాల్లో కిరణ్ ఉన్నాడు. ప్రపంచకప్ స్పిరిట్‌ను కాపాడుకోవడానికి హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌కు చెందిన రిత్విక్, నయన్‌దీప్, వరుణ్, అభినవ్, శరద్, వినీత్, సుధీర్ తదితరులు ఇంటర్ క్లాస్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. "మా వద్ద ప్రత్యేక ప్రణాళికలు ఉన్నాయి. మేమంతా కలిసి మ్యాచ్‌లను తిలకించడానికి ఏదోఒక స్నేహితుని ఇంటికి వెళ్తాం. స్నేహితుల ఇంట్లోవాళ్లు కూడా మాకు పూర్తి మద్దతు ఇస్తారు" నయన్‌దీప్ అన్నాడు. "ప్రపంచకప్‌లో మా దృష్టి ప్రధానంగా ఒక మ్యాచ్‌పై ఉంది. ఎన్ని అవాంతరాలు, కష్టాలు ఎదురైనా భారత్-పాకిస్తాన్ జట్ల మధ్య జరిగే మ్యాచ్‌ను మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోం" అని కలీమ్, శశాంక్, రాథోర్, అంకుశ్ ముక్త కంఠంతో అన్నారు.



రాష్ట్రంలో దాదాపు అన్ని తరగతుల విద్యార్థులకు ఇది పరీక్షల సీజన్. కానీ 43 రోజులపాటు క్రికెట్ అభిమానులను అలరించనున్న ప్రపంచకప్ ఛాంపియన్‌షిప్ వల్ల విద్యార్థుల చదువుకు దెబ్బ. నాలుగేళ్లకోసారి వచ్చే ప్రపంచకప్‌ను తిలకించకుండా వుండలేమని పిల్లలు, యువకులు అంటుండగా వీరిని క్రికెట్‌కు దూరంగా వుంచి చదువుపట్ల ఏకాగ్రతను కనబర్చేట్లు ఎలా కృషి చేయాలో అర్థం కాక వారి తల్లిదండ్రులు సతమతమవుతున్నారు.

ఉన్నత విద్య అభ్యసిస్తున్న వారికీ తగ్గని క్రికెట్ మోజు

స్కూల్ విద్యార్థులే కాదు ప్రపంచకప్ పట్ల ఉన్నత విద్యను అభ్యసిస్తున్న యువకులు కూడా అమితాసక్తిని కనబరుస్తున్నారు. "మా పరీక్షలు దగ్గరపడినందున రోజుకు కనీసం పదహారు గంటలు చదవాల్సి ఉంది. కానీ నాలుగేళ్లకోసారి వచ్చే ప్రపంచకప్‌ను చూడకుండా ఉండలేను. అందుకే మ్యాచ్‌లు చూడడానికీ కొంత సమయం కేటాయించాలనుకుంటున్నాను" అని ఎంబిఎ విద్యార్థి రాబర్ట్ అన్నాడు. మ్యాచ్ చూడకుండా చదువుకోవాలన్నా తాను చదివింది తలకెక్కదని అతను చెప్పాడు. డిగ్రీ కంప్యూటర్ కోర్సు చేస్తున్న హర్షవర్ధన్ రెడ్డి అభిప్రాయం కూడా అదే. తాను క్రికెట్ ముఖ్యంగా భారత్ ఆడే మ్యాచ్‌లను చూసి తీరాల్సిందేనని అతను చెప్తున్నాడు. ఇంజనీరింగ్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలకు తేదీ దగ్గరపడ్తున్నా పట్టించుకోవడం లేదు. "నేను సెమిస్టర్ పరీక్షలకు ప్రిపేర్ అవుతూనే ప్రపంచకప్‌ను కూడా తిలకిస్తాను. ఒక టైం టేబుల్ తయారు చేసి పరీక్షల ప్రిపరేషన్‌కు, మ్యాచ్‌లు తిలకించడానికి ప్రణాళికాబద్ధంగా సమయం కేటాయిస్తానని ఉస్మానియా యూనివర్శిటీలో ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న రిజ్వాన్ తెలిపాడు. దీంతో తన చదువుకు ఆటంకం కలగకుండా ప్రపంచకప్‌ను తిలకించగలుగుతాననే ధీమాను అతను వ్యక్తం చేశాడు. ప్రపంచకప్‌ను మిస్ చేస్తే నా అంత తెలివితక్కువ వాడు మరొకరు ఉండరు అని హరీష్ అన్నాడు. అతను గుంటూరులో మెడిసిన్ చేస్తున్నాడు.

అమ్మాయిల్లోనూ పెరుగుతున్న మోజు

విద్యార్థులతో పాటు విద్యార్థినులు కూడా ఆసక్తి కనబర్చడం ఈ ప్రపంచకప్ ప్రత్యేకత. సచిన్ విజృంభణ, సెహవాగ్ 'వీర' విహారాన్ని తాను చూడాల్సిందేనని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ విద్యార్థినులు అమృత, ఆరిత్రా, సాయికా, నెహా, తనూజాలు ఘంటాపథంగా చెప్తున్నారు. "నా దృష్టి పరీక్షలపై కంటే రాహుల్ ద్రావిడ్ బ్యాటింగ్‌పైనే ఎక్కువగా ఉంది. అతని బ్యాటింగ్ చూసి తీరాల్సిందే" అని నెహా అంటోంది. తాను సమయాన్ని స్టడీస్‌తో పాటు క్రికెట్‌కూ సమానంగా కేటాయిస్తానని నీరజ్ పబ్లిక్ స్కూల్ విద్యార్థిని బ్రిందా చెప్పింది. 'నేను క్రికెట్ కోసం చదువును నిర్లక్ష్యం చేయను. అలాగని నాలుగేళ్లకోసారి వచ్చే ప్రపంచకప్‌నూ చూడకుండా ఉండలేను" అని ఈడెన్ హైస్కూల్ విద్యార్థిని సుమేరా పేర్కొంది.

ఇదిలావుండగా తమపిల్లలను క్రికెట్ చూడకుండా ఎలా నిరోధించాలో అర్థంకాక మరోవైపు తల్లిదండ్రులు తల పట్టుకుంటున్నారు. క్రికెట్ చూడొద్దని చెప్పినా పిల్లలు తమ మాట వినరని పెద్దలు వాపోతున్నారు. కట్టడి చేస్తే చాటుమాటుగా స్నేహితుల ఇళ్లలో గంటల తరబడి టీవీలకు అతుక్కుపోయి తమనే మోసం చేస్తారని బాధపడ్తున్నారు. దీనికంటే తమ పిల్లలకు నిర్ణీత సమయం క్రికెట్ చూసే వెసులుబాటు కల్పిస్తే మిగిలిన సమయంలో చదువుపై ఒత్తిడి చేసే అవకాశం ఉంటుందని సురేందర్ రావు అనే బ్యాంక్ ఉద్యోగి భావిస్తున్నారు. "మా పెద్ద బ్బాయి ఇంటర్మీడియట్, రెండో అబ్బాయి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. వారిని క్రికెట్ చూడొద్దని అంటే మా కళ్లుగప్పి స్నేహితుల ఇళ్లకెళ్లి చూస్తారు. టోర్నీ జరిగే 43 రోజులపాటూ వారిని కట్టడి చేయలేం. అందుకే ప్రతిరోజూ రెండు మూడు గంటలు క్రికెట్ చూసి మిగిలిన సమయంలో చదువుపట్ల శ్రద్ధ కనబర్చాలని నా పిల్లలకు సూచించాను" అని రైల్వేలో స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్న సురేందర్ అన్నారు. మొత్తంమీద విద్యార్థుల చదువుపై ప్రపంచకప్ తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ముఖ్యంగా క్రికెట్ అంటే చెవికోసుకునే వారున్న భారత్‌లో దీని ప్రభావం మరింత ఎక్కువ. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో అన్ని తరగతుల వారికి ఇదే సమయంలో పరీక్షలు ఉన్నందున చదువుపై క్రికెట్ ప్రభావం పడే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ◆

కోడూరు శివనాగేశ్వరరావు

సూర్యుడు డ్యూటీ దిగిపోయాడు. చంద్రుడు డ్యూటీ ఎక్కడానికి సన్నద్ధమవుతున్నాడు.

గోడమీద పాకిన సన్నజాజితీగ నుండి పూలు కోసి వీధి అరుగు మీద కూర్చుని కూతురికి, కోడలికి పువ్వుల మాల కడుతోంది సరస్వతమ్మ.

శ్రీవారి చిరకాల మిత్రుడు చలపతిరావు సరస్వతమ్మ ముందుకొచ్చి సైకిల్ ఆపి దిగాడు.

అతన్ని చూసి సరస్వతమ్మ చెంగు భుజాల మీదకు తీసుకుని లేచి నిలబడింది.

"అబ్బాయి ఇంట్లో లేడామ్మా" అంటూ ఇంటి గుమ్మం వైపు చూస్తూ కంగారుగా అడిగాడు.

"లేడండీ స్నేహితులతో కలిసి బయటి కెళ్ళాడు." ఒద్దికగా సమాధానమిచ్చింది సరస్వతమ్మ.

శ్రీవారిని అడగకుండా అబ్బాయిని అడుగుతున్నారెందుకో అనుకుంటూనే నిలబడింది.

"ఏం లేదమ్మా మా నరసింహాన్ని అదే మీ శ్రీవారిని స్కూటర్ ఢీకొంది. ఆసుపత్రిలో చేర్చాము. ఆహా! ప్రమాదమేమీలేదు. నువ్ బయల్దేరు ఆసుపత్రికి వెళ్ళాం" అంటూనే సైకిల్ వెనక్కి తిప్పాడు.

విషయం విన్న సరస్వతమ్మ "అమ్మా శారదా, విశాలీ విన్నారే? ఆయనకి ఆక్సిడెంట్ అయ్యిందట" ఓరి దేవుడో మాకీ కష్టం ఏమిటి స్వామీ" అంటూ శోకండాలు పెడుతూ కోడల్ని, కూతుర్ని పిలుస్తూ ఇంట్లోకి పరుగులు తీసింది.

వాళ్ళిద్దరూ ఈమె అరుపులకి ఇంట్లోనుండి పరుగులెత్తుకుని వీధి గుమ్మంలోకొచ్చారు.

చలపతిరావు సైకిలక్కడ పెట్టి ఇంట్లోకెళ్ళి వాళ్ళను ప్రమాదమేమీ లేదని సముదాయించి తాను అబ్బాయిని వెతుక్కుని ఆసుపత్రికి తీసుకొస్తానని చెప్పి ముగ్గురాడవాళ్ళకి ఆటో కుదుర్చి తమ నరసింహం కొడుకు కోసం వెతుకులాట మొదలెట్టాడు.

వెతగ్గా వెతగ్గా తాజ్‌మహల్ సెంటర్లో స్నేహితులతో కలిసి చాయ్ తాగుతూ నరసింహం ఏకైక కుమారుడు రాజేష్, చలపతిరావు కంటపడ్డాడు.

చలపతిరావు రాజేష్‌ని పక్కకు పిలిచాడు. 'హాయ్ అంకుల్' అంటూ వచ్చాడు రాజేష్.

చలపతిరావు రాజేష్ ఎక్కడ కంగారు పడతాడోనని నెమ్మదిగా విషయాన్ని చెప్పాడు.

రాజేష్ ముఖం ప్రశ్నార్థకంగా చలపతిరావు వంక చూసింది. చూపులో అంతరార్థం చలపతిరావుకి బోధపడలేదు.

"డాడీ ఉన్నారా అంకుల్ పోయారా, మీతో ఏమైనా చెప్పారా!! అన్నాడు చకచకా రాజేష్.

చలపతిరావు ఖంగుతిన్నాడు. వీడేమిటిరా బాబు ఇంత ప్రాక్టికల్‌గా అడుగుతున్నాడు అనుకుంటూ.

"తలకు దెబ్బ తగిలింది. స్పృహలో లేడు కానీ బ్రతికే వున్నాడు" వ్యంగ్యం, కోపం ధ్వనిస్తూ అన్నాడు చలపతిరావు.

రాజేష్ అండ్ కంపెనీ మోటారు సైకిళ్ళ మీద ఝుమ్మంటూ ఆసుపత్రి వైపు దుమ్ము లేపారు.

చలపతిరావు రెండుసార్లు తల మోదుకుని "ఖర్మఖర్మ" అంటూ తన అంబర్ సైకిల్‌ను కడ్డీ తొక్కుడు తొక్కుకుంటూ వారి వెనకబడ్డాడు.

* * *

ముగ్గురాడవాళ్ళూ నరసింహం వున్న గది బయట బల్ల మీద విషణ్ణవదనంతో కూర్చున్నారు.

సరస్వతమ్మ కూతురికి కోడలికి నరసింహాన్ని గూర్చిన విషయాలు అంటే ఆయనకు ఏ కూర ఇష్టం. ఏ రంగు ఇష్టం వంటి విషయాలు గద్గద స్వరంతో శోకలయబద్ధంగా ముక్కు చీదుకుంటూ తలవూపుతూ చెపుతోంది. వాళ్ళు ఈమె భుజాలపై చేతులు వేసి "ఊరుకో ఆయనకేమీ కారు. డాక్టర్లు ఫర్వాలేదన్నారుగా" అంటూ అనునయిస్తున్నారు.

"రాజేష్, మిత్రబృందం కీచైన్‌లు చూపుడు వేలుకు చుట్టుకునేలా తిప్పుకుంటూ స్పీడ్‌గా రూమ్‌దగ్గర కొచ్చారు.

''ఏమ్మా డాక్టరేమన్నాడు. నాన్న మాట్లాడుతున్నారా? ఇక్కడ కూర్చున్నారేమిటీ?. నాన్నేరి" అంటూ ప్రశ్నల వర్షం కురిపించాడు ఆతృతగా.

రాజేష్‌ను చూసిన సరస్వతమ్మ మీ నాన్నగారు లోపలున్నారంటూ రూమ్‌వైపు చూపి లోపలకెళ్ళనీయటం లేదురా అంటూ ముక్కు చీదుకుంది.

ఛకాలున డోరు తీసుకుని లోపలకెళ్ళాడు రాజేష్. అతని వెనక ఆడవాళ్ళు. నరసింహం పక్కనే కూర్చుని బి.పి. చూస్తున్న నర్సు డోరు శబ్దం విని రాజేష్ వైపు చూసింది.

"పేషెంటు స్పృహలో లేడు. బయటకెళ్ళండి. స్పృహలోకొచ్చాక పిలుస్తాను. నర్సు సాత్వికంగా రోగిని డిస్టర్బ్ చేయొద్దన్నట్లు చెప్పింది.

నరసింహం చేతికి సెలైన్ ఎక్కుతోంది. తల గాయానికి కట్టు కట్టి వుంది. నెమ్మదిగా కదులుతున్నాడు. నొసలు చిట్లిస్తున్నాడు. ఇవేమీ గమనించని రాజేష్ స్పృహలోకి రావటానికి ఎంత టైం పడుతుంది" అంటూ కళ్ళు చిట్లిస్తూ నర్సుని ప్రశ్నించాడు.

"డ్యూటీ డాక్టర్‌ను అడగండి సార్" అందామె.

"డ్యూటీ డాక్టర్ నడగాలా, అయితే మరి నువ్వెందుకు మాట్లాడుతున్నావ్" అని సీరియస్‌గా ప్రశ్నించాడు రాజేష్ నర్సుని.

"ఏమిటి సార్ మీరు మాట్లాడేది. నా డ్యూటీ నేను చేస్తున్నాను. మీరు వివరాలు ఏమైనా డాక్టరుగారి నడిగి తెలుసుకోవాలి. అదే చెప్పాను నేను. సీరియస్‌గా మాట్లాడతారేమిటి" అని రాజేష్

వైఖరి అర్థంగాక ఆమె సీరియస్‌గానే సమాధానమిచ్చింది.

"మేమత్యవసరంగా పేషెంటుతో మాట్లాడాలి. పేషెంటుని స్పృహలోకి తీసుకురావాలి. వెళ్ళు వెళ్ళి డాక్టర్ని పిలుచుకురా" రాజేష్ నర్సుకు ఆజ్ఞ జారీ చేశాడు.

"నేను పేషెంటు దగ్గర్నుండి కదలను. మీరే వెళ్ళండి. వెళ్ళి డాక్టరు గార్ని కలవండి" అంతే సీరియస్‌గా స్థిరంగా అంది నర్సు.

"పిచ్చి పిచ్చిగా వుందా చెబితే వినిపించుకోవు. పేషెంటు స్పృహలోకి రాకుండా అల్లాగే పోతే మేమెంత నష్టపోతామనుకుంటున్నావ్, మీదేమి పోతుంది. మా ప్రయత్నం మేం చేశామని సినిమా డైలాగొకటి చెప్పి ఊరుకుంటారు" అంటూ నర్సుపై అరిచాడు రాజేష్.

"అన్నయ్యా ఊరుకోరా, అరవమాకు నాన్నకేమీ కాదని చెప్పార్రా డాక్టరుగారు" అన్న చెయ్యి పట్టుకుని శాంతించమంటూ చెపుతోంది రాజేష్ చెల్లెలు శారద.

"ఏమీ కాదని అట్లాగే చెపుతారు వీళ్ళు. అయిపోయాక మేమూ మానవమాత్రులమేగా అంటారు. ఆయనిప్పుడు చెప్పాల్సిన విషయాలు అనేకం వున్నాయి. వీఆర్ఎస్ రిటైర్మెంట్ అయితే వచ్చిన డబ్బు ఏమి చేశారో నాతో చెప్పలేదు. అమ్మతో చెప్పలేదు. ఇప్పుడు గభాలున పుటుక్కుమంటే" అసహనంగా రాజేష్ అసలు విషయాన్ని బయటపెట్టాడు.

అప్పుడే గదిలోకొచ్చి రాజేష్ నోటివెంట ఈ మాటల్ని విన్న చలపతిరావు అవాక్కయ్యాడు.

రాజేష్ చెల్లెలు, తల్లీ కూడా ఖ్రాన్సడిపోయారు. డాక్టర్ ఏమీ కాదు అని చెప్పినా రాజేష్ నర్సుమీద ఎందుకింత చిరాకు పడుతున్నాడో వాళ్ళకిప్పుడు అర్థమైంది.

నరసింహం కళ్ళు ఒక్కసారి తెరుచుకుని మూతపడ్డాయి.

నర్సు రాజేష్‌ని, మిగతా వాళ్ళని బలవంతాన బయటకు నెట్టింది. చలపతిరావు దూరంగా వెళ్ళి కూర్చున్నాడు. తన స్నేహితుడు కొడుకును ఎంత గారాబంగా పెంచాడు. కడుపు కట్టుకుని రెసిడెన్షియల్స్ చేర్చి చదివించాడు.

వాడు సైకిల్ తొక్కి, వీడికి స్కూటరు కొనిచ్చాడు. రాజేష్‌కు ఫ్లూజ్వరమొచ్చినా ఆఫీసుకు సెలవుపెట్టి బిడ్డ పక్కనే కూర్చునేవాడు.

అటువంటి వాడి కడుపున ఇలాంటి వాడు పుట్టాడా అరెరె ఏమీ లోకం. రాజేష్ ఒక్కడనే ఏముందిలే.

కుర్రకారు ఎక్కువ మంది ఇలానే వున్నారు. మేము మిమ్మల్ని పువ్వుల్లో పెట్టి చూశామురా అని ఏ తల్లి తండ్రులైనా అంటే అది మీ బాధ్యత... అంత ఏడ్వలేని వారు ఎందుకన్నారు అని ప్రశ్నించేలా వున్నారు.

చదువుల కోసం తల్లిదండ్రులకు దూరంగా ఉండి కమర్షియల్ చదువులు చదివిన వారికి తల్లిదండ్రులు అన్నీ సమకూర్చే మనుషులుగానే తప్ప, మానవ సంబంధాల విలువలు తెలియటం లేదు.

ఆ కాలేజీల్లో బోధించటమూ లేదు. అంతా బిజినెస్ లైక్ బ్రతుకులైపోయాయి.

ఆప్యాయతానురాగాలు జస్ట్ లైక్‌గా కుదించుకుపోయాయి. చలపతిరావుకి రాజేష్‌లో ఎకనామిక్స్ పోస్ట్‌గ్రాడ్యుయేట్ కనబడుతున్నాడు. అవును ఏ తండ్రైనా బిడ్డ బాగా చదివి పైకి రావాలనేగా కోరుకునేది.

రాజేష్ ఆర్థిక శాస్త్రాన్ని వంట బట్టించుకున్న మనిషిగా పైకొచ్చాడా? కొడుకుగా పైకొచ్చాడనుకోవాలా? ఏమనుకోవాలి....!? తండ్రి కోరిక తీర్చాడా! చలపతిరావు రాజేష్‌ని దూరం నుండి అలానే చూస్తూ కూర్చుండి పోయాడు.

నర్సు వెళ్ళి డాక్టర్‌గారిని వెంటబెట్టుకొచ్చింది.

"డాక్టర్‌గారూ మానాన్న గారితో మాట్లాడాలి" వస్తున్న డాక్టర్ని ఆపి రాజేష్ అడిగాడు.

మా నాన్నగారికెలా వుంది అని అడిగే ఆలోచన కూడా అతనికిలేదు.

"చూసి కబురు చేస్తానుండండి" అని డాక్టర్‌గారు లోపలికెళ్ళారు. పది నిమిషాల తర్వాత బయటకొచ్చి "చూడండి మీ నాన్నగారికి ప్రాణహాని లేదు. ఇంజక్షన్ల మత్తు వలన నిద్రపోతున్నారు. రేపు మధ్యాహ్నం రండి. మాట్లాడుదురుగాని. బావుంటే డిశ్చార్జ్ కూడా చేస్తాను" అని చెప్పి రాజేష్ సమాధానానికి కూడా చూడకుండా డాక్టర్ వెళ్ళిపోయాడు.

"ఓ.కె... థాంక్యూడాక్టర్ థాంక్యూ" అన్నాడు రాజేష్. తండ్రికి వీఆర్ఎస్ కింద సుమారు ఎనిమిది లక్షలొచ్చాయని తెలుసు. తండ్రే చెబుతాడని చూశాడు. ఇంతకీ వీఆర్ఎస్ తీసుకుని నరసింహం రెండు రోజులే అయ్యింది.

అంతలోనే ఇంత జరిగింది. డాక్టర్ మాటలతో ఎనిమిది లక్షల ఆచూకీ బతికిందని తెలిసిపోయింది.

గనుక రాజే హ్యాపీగా వున్నాడు. దెబ్బలదేముంది. నాలుగు రోజులు రెస్ట్ తీసుకుంటే అవే మానతాయి.

పని మాత్రం ఏముంది. ముసలాయన ఇంట్లో పడుండే వాడేగా అనుకున్నాడు రాజేష్.

"మమ్మీ నా ఫ్రెండ్స్ ఉన్నారుగా వాళ్ళను పంపించి నేను ఇంటి కొచ్చేస్తాను. మీరూ వచ్చేయండి. మనం చేసేదేముంది. అంతా సిస్టర్ చూసుకుంటుందిలే" అన్నాడు నిలుచున్న సిస్టర్‌ని చూపిస్తూ.

"నేను చూసుకుంటా. మీరువెళ్ళి రండమ్మా" అంటూ సిస్టర్ లోపలికివెళ్ళింది.

"మేముంటాములే నువ్వెళ్ళన్నయ్యా..." అంది రాజేష్ చెల్లెలు శారద.

"ఓకే బాయ్" రాజేష్ నిష్క్రమించాడు.

సరస్వతమ్మ తన భర్త ఆరోగ్యం బాగుపడి బయటకు రావాలని వెయ్యి దేవుళ్ళకు మొక్కుకుంది.

కొడుకు నైజం ఏమిటి ? లోకం పోకడ ఏమిటి ? ఇవేమీ అక్కర్లేదు ఆమెకి.

తెస్తే తిని, చస్తే ముండమోసే కోట్లాది ఇల్లాళ్ళలో మొదటిది ఆమె.

రాత్రి 8 గంటలవుతోంది. "మీరిక వెళ్ళండమ్మా టైమైపోతుంది" అని సిస్టర్ ముగ్గురాడవాళ్ళను పంపించి వేసింది.

చలపతిరావు నెమ్మదిగా బయల్దేరాడు. నర్సువచ్చి చలపతిరావుని రూములోకి రమ్మంటూ తీసుకెళ్ళింది.

ఓ గంట అనంతరం చలపతిరావు రూములోనుండి బయటకొచ్చి తన ఇంటికెళ్ళిపోయాడు.

* * *

పన్నెండు గంటలకల్లా రాజేష్ తండ్రున్న రూముకి వచ్చేశాడు. అప్పటికే చలపతిరావు, నరసింహానికి బత్తాయి రసమిస్తూ పక్కన కూర్చున్నాడు.

"హాయ్ డాడీ ఎలా వున్నారు. హలో అంకుల్ ఎంతసేపయ్యిందొచ్చి" అంటూ కుర్చీలాక్కుని కూర్చున్నాడు రాజేష్.

నరసింహానికి రాజేష్ ముఖం కూడా చూడాలన్పించటం లేదు. ఆయన చూపులు నేలను బద్దలు చేస్తున్నాయి.

చలపతిరావు రాజేష్‌ని ఏమీ చేయలేక బత్తాయిల్ని పిప్పి చేస్తున్నాడు.

"చలపతీ బిల్ కట్టిరా వెళ్దాము" అని దిండు కిందడబ్బు తీసి చలపతిరావు చేతిలో పెట్టాడు నరసింహం.

"ఇలా ఇవ్వండి నేను కట్టొస్తాను" అడిగాడు రాజేష్.

"అవసరం లేదు" అని రాజేష్‌ను నివారించి "నువ్వెళ్ళు" అన్నట్లు సైగ చేశాడు నరసింహం, చలపతిరావుని.

"ఏం నేను కట్టి వస్తానుగా" అని రెట్టించాడు రాజేష్.

అతనితో మాట్లాడాలంటేనే పాములు, జెర్రులు పాకుతున్నట్లున్న నరసింహం ఇంక తన ఆక్రోశాన్ని ఆపుకోలేకపోయాడు.

"డబ్బు ఏం చేశానో చెప్పిన తర్వాత చచ్చినా ఫర్లేదనుకున్న నువ్వు నా పట్ల ఏ బాధ్యతా చూపనవసరం లేదు." నువ్వు చేసే ప్రతి చర్య వెనకా నా స్థానంలో నీకు డబ్బు కన్పిస్తున్నట్లుంది.

ఆ డబ్బు నీకు చిల్లిగవ్వ దక్కదు. అసలు నాకు కొడుకే పుట్టలేదనుకుంటాను" కసిగా లేచి నిలబడ్డాడు నరసింహం.

"తొందర పడొద్దురా" అంటూ వారించాడు చలపతిరావు. "తొందర పడటంలేదురా తెలుసుకున్నాక తెలివిగా బతకాలనుకుంటున్నాను."

"నీతో అతను ఎలా ప్రవర్తించాడో, నువ్వూ అతనితో అలాగే ప్రవర్తించు" అన్నది పెద్దల భాష్యం.

అలా చెయ్యకపోతే నేను పెద్దల్ని అగౌరవపరచిన వాణ్ణి అవుతానురా, నాకు నా పెద్దల మంచీ చెడూ కావాలి. వారి సలహాలు మందలింపులు కావాలి.

పెద్దల్నుండి లభించిన విజ్ఞానం, తల్లిదండ్రుల వలన ఏర్పడ్డ ఈ శరీరం తెలివెరిగి బతకాలనుకుంటుందిరా..

నేను, నా కుటుంబం, నా పిల్లలు అన్నీ కుత్సిత స్వభావం నా కొడుకైన ఈ ఆర్థికశాస్త్రవేత్తగారి మాటలతో నిన్ననే పోయింది.

నాకు ఇవాల్టి నుండి సజ్జనుడైన ప్రతిమనిషీ నాకు స్నేహితుడుగానే కన్పిస్తున్నాడు. పదరా చలపతీ పదా" అంటూ ఆవేశంగా రూములోనుండి చలపతిరావు చెయ్యిబట్టుకుని దారి తీశాడు నరసింహం.

"మీరు ఇవ్వనన్న మాత్రాన మీ సంపాదన నాకు రాకపోదు. మనిషి ప్రాక్టికల్‌గా వుండాలి. ఉంటేనే పైకొచ్చేది. అంచేత నిన్న నేను కంగారు పడింది. మీరు ఇవ్వనని మొండికేస్తే చట్టం తన పని తాను చేసుకుపోతుంది" చాలా కూల్‌గా ప్రాక్టికల్‌గా విషయాన్ని తండ్రికి వివరించాడు ప్రాక్టికల్ ఆర్థికవేత్త రాజేష్.

"చట్టాలు భౌతికంగా మాత్రమే ఇబ్బంది పెట్టగలవు. భౌతిక సుఖాల కోసమే నా నుండి నీకు ఆస్తి సంక్రమించి ఉపయోగపడవచ్చు కానీవ్వు నా బిడ్డవు కావు."

నా మనస్సులో కొడుకు స్థానంలో నుండి నిన్ను తుడిచేసుకున్నాను.

తిరిగి నా హృదయంలో నిన్ను నా బిడ్డగా సృష్టించటం ఏ చట్టం వల్లనో అయ్యే పని కాదు.

నా దృష్టిలో నువ్వు కేవలం, నా ఆస్తిని పంచుకునే, చట్టాలు తెలిసిన చదువుకున్న మూర్ఖుడివి.

నా మంచిచెడూ పంచుకునే మనిషివైతే కొడుకువనుకునే వాణ్ణి. ఇప్పుడు కేవలం నీవు ఒక మనిషి ఇంద్రియాన్నుండి జన్మించిన మరో మనిషివి అంతే"

కట్టలు తెంచుకున్న ఆగ్రహంతో చిరకాల మిత్రుని చేతిని మరింత గాఢంగా పట్టుకుని, మరింత మానవీయ సంబంధాన్ని పెనవేసుకున్న నిష్కర్ష మనిషి నరసింహం బయటకొచ్చాడు.

ఏ లాయరైతే బావుంటుందాని ఆర్థికవేత్త ఆలోచనలో పడ్డాడు.

◆

వేదిభూమి కాదు ఇది
నాగభూమి
రచన : కొత్త శివమూర్తి;
వెల : రూ.25/-,
ప్రతులకు : విశాలాంధ్ర, నవోదయ బుక్‌హౌస్.

'... నాగభూమి' యే కానీ...

ఇంగ్లీషు అక్షరాలకు అంకెల విలువలను ఆపాదించి, ఆ విలువల ఆధారంగా 'యుగాల' కాలాలను 'డీకోడ్' చేసి చరిత్రను 'తెలియజేసే' పుస్తకం 'వేదభూమి కాదు ఇది నాగభూమి'. దీని రచయిత కొత్త శివమూర్తి. ఆర్యులు ఇండియా సామాజిక చరిత్రలోనే కాదు ప్రపంచ చరిత్రలోనే ప్రధాన పాత్ర పోషించారని, ఆ మూలాలను తెలుసుకోకపోవడం వల్లనే వారిపై చేసే ఏ పోరాటమూ విజయవంతం కావడం లేదని ఈ పుస్తకంలో అభిప్రాయపడతారు. ఆర్య సంస్కృతిలోనే 'బ్రాహ్మణిజం' మూలాలు దాగి ఉన్నాయని, కావున వీరి చరిత్రను స్పష్టంగా తెలుసుకుంటేనే దోపిడిపై సరైన ప్రతిచర్య సాధ్యమనీ ఆయనంటారు.

ఈ పుస్తకంలో గణాంకాలు ఆసక్తికరంగా అనిపించినా, పరిశీలించిన తీరు అర్థవంతంగా అనిపించడం లేదు. లెక్కల్లో తెలియని దానిని తెలుసుకోడానికి తొలుత దానికి 'x' (ఇంగ్లీషులో 24వ అక్షరం) అని పేరు పెట్టి తెలుసుకుంటున్న పద్ధతిలోనే ఆర్యుల చరిత్రను యుగాల చరిత్రలో ఇంగ్లీషు అక్షరాల సంఖ్యల విలువ ఆధారంగా తెలుసుకున్నానని రచయిత పేర్కొన్నారు. కానీ దానికీ, దీనికీ పద్ధతి పాటించిన తీరు ఒకేలా లేదు. వేర్వేరు అంశాలను కలబోసి సమానంగా అనిపించిన సంఖ్యలను పోలికగా చెప్పారు. ఒక పేరును, ఒక జాతిని, కొన్ని పేర్లను, కొన్ని పుస్తకాలను పోల్చడాన్ని బట్టి ఏవి సరిపోతే వాటిని పోలికగా తెచ్చినట్లు అనిపిస్తుంది. ఉదాహరణకు కృష్ణుడి జీవిత కాలం 125 ఏళ్ళు, క్రీస్తు పేరుతో వచ్చిన పుస్తకాల సంఖ్య 125లను పోల్చి... ఒకే మూలాలని చెప్పడం ఎంత వరకు హేతుబద్ధమనే ప్రశ్న ఉదయిస్తుంది.

'ఆర్యులు ఇక్కడి వారు కారు.. ఎక్కడి నుంచో వచ్చారు... వారి మూలాలు ప్రపంచ వ్యాపితం... బ్రాహ్మణిజం అందులోనిదే..'ననేది మొత్తంగా రచయిత చెప్పదలచుకున్నది. వారి 'తత్వం', భూమిక 'ప్రపంచ వ్యాపితమన్నదే' రచయిత కొత్తగా చెప్పదలచినది. మనం ప్రస్తుతం తెలుసుకుంటున్న చరిత్ర సరైంది కాదని, మార్క్సిస్టు చరిత్రకారులు దానిని వక్రీకరించారని అభిప్రాయపడడం సరైందిగా లేదు. ఆర్యులు ఎక్కడి నుంచో వచ్చారని ఇప్పటికే చెప్పడం వక్రీకరించడం ఎలా అవుతుంది? అయినా దానిని పట్టించుకోనవసరం లేదు కానీ, ఆర్యులు 'కోడ్'లతో తమ చరిత్రను చెప్పాలనుకున్నా, తమకే అర్థం కానంత మార్మికంగా (యుగాల లెక్కలు.. ఇంగ్లీషు అక్షరాల విలువలతో) దాచి ఉంచారేమో అనిపిస్తుంది. ఒక ఆధిపత్య జాతి ప్రపంచమంతా సామ్రాజ్యవాదంతో విస్తరించిందన్న రచయిత భావనను అర్థం చేసుకోవచ్చేమో కానీ, అందుకు చూపిన 'గణాంక' ఆధారాలు అర్థవంతంగా లేవు.

చరిత్రను అధ్యయనం చేసే వారు ఆసక్తి అనిపిస్తే ఒకసారి పరిశీలించవచ్చు. అవసరమో కాదో వెంటనే వారికి తెలిసిపోతుంది. ఈ పుస్తకాన్ని 'నాగా ప్రచురణలు' ప్రచురించారు.

మత భావనల పట్ల అవగాహన పెంచే పుస్తకం



బ్రాహ్మణులు-హిందువులా
రచన : పెరుగు రామిరెడ్డి,
వెల : రూ. 20/-
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

'హిందూమతం పునరుజ్జీవన దశలో ఉంది. రానున్న వెయ్యేళ్ళలో అదొక ఆదర్శ ధర్మంగా విలసిల్లబోతున్నద'ని ప్రధాని వాజ్‌పేయి చేసిన వ్యాఖ్యానానికి ప్రతిగా, మతంతో సంబంధమున్న మూఢ నమ్మకాలు, ఆచారాలు, వృధా వ్యయాల వంటి అనేక అంశాలను వివరిస్తూ రాసిన పుస్తకం 'బ్రాహ్మణులు హిందువులా?". దీని రచయిత పెరుగు రామిరెడ్డి. మన దేశంలోని ఏ ప్రాంతంలోనూ, ఏ కాలంలోనూ, వేదాలతో సహా ఏ ప్రాచీన గ్రంథంలోనూ 'హిందూ' మతమనే ప్రస్తావన కూడా లేదని, లేని దానిని ఎలా పునరుజ్జీవింప జేస్తారని రచయిత ప్రశ్నించారు. అంతేకాదు మతమనే దానికి మూలపురుషుడు, మూల గ్రంథం, నియమాలు ఉంటాయని, కానీ 'ఉందంటున్న' హిందూ మతానికి అలాంటివేమీ లేవని ఆయన తార్కికంగా స్పష్టం చేశారు.

ఈ విషయాల కంటే కూడా దేవుళ్ళు, బాబాలు, మంత్రాల వంటి వాటి హేతుబద్ధతను ప్రశ్నిస్తూ సరళంగా... సూటిగా... రచయిత వ్యాఖ్యానాలు చేశారు.

ఇందులో కొత్త విషయాలేమీ లేకున్నా... మతం పేరిట తప్పుదారి పట్టించి మత నమ్మకాలు పెంచే వారికి సమాధానంగానూ, వారి ప్రభావానికి గుర్రై కొట్టుకుపోయే సామాన్యులకు అవగాహన కలిగించేదిగానూ ఈ పుస్తకం దోహదపడుతుంది.

- టివైకె

స్వీకారం

నిరుద్యోగ యువత స్వయంగా తమ కాళ్ళపై తాము నిలబడేందుకు అవసరమైన అనేక విషయాలను ఇందులో పొందుపరిచారు. ఏ విధంగా స్వయం ఉపాధి పథకాలను చేపట్టవచ్చో ఈ పుస్తకంలో చక్కగా వివరించారు. స్వయం ఉపాధి పథకాలకు అవసరమైన డబ్బును బ్యాంకుల ద్వారా పొందే విధానాన్ని వివిధ పథకాలకు అవసరమైన విద్యార్హతలు, ఇతర వివరాలను కూడా ఇందులో వివరించారు.

నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి పథకాలు
రచన : ఎ.జయప్రకాష్; వెల : రూ.200/-;
ప్రతులకు : ఆలిండియా సెల్ఫ్ ఎంప్లాయిడ్ అసోసియేషన్, 9/90 జార్జిపేట, నెల్లూరు; స్వయం కృషి పబ్లికేషన్స్, 5-12-132/3/ఎ, శాంతినగర్, నల్గొండ.

చిల్మన్ కాలం మాత్రమే కాదు దూరం కూడా. దూరపు చిల్మన్‌లను దగ్గర చేసేవి, లేకుండా చేసేవి ఉత్తరాలు.

చిల్మన్
రచన: ఆశారాజు;
వెల : రూ. 30/-;
ప్రతులకు : విశాలాంధ్ర బుక్‌హౌస్, ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు; దిశ పుస్తక కేంద్రం, నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్.

బద్ది వారి బుద్ధి శతకం



రచన: బద్ది నాగేశ్వరరావు;
వెల : రూ. 10/-;
ప్రతులకు : బద్ది నాగేశ్వరరావు, 13-9-5, గోలివీధి, దేవుని గుమ్మం, అనకాపల్లి, విశాఖపట్నం; సాహితీ వేదిక, కేరాఫ్ శారదా గ్రంథాలయం, అనకాపల్లి.

అక్కడికి రాగా రాజేష్ అతడిని రివాల్వర్‌తో బెదిరించి అక్కడి నుంచి వెళ్ళిపొమ్మని చెప్పాడు. రాజేష్ గిరీష్ సోదరి కొడుకు. గిరీష్ వంట మనిషి అయిన సతీష్ గిరీష్ భార్యతో టెలిఫోన్‌లో మాట్లాడుతుండగా రాకేష్ టెలిఫోన్ దగ్గరకు వెళ్ళి టెలిఫోన్ లాక్కొని గిరీష్‌పై దాడి జరుగుతున్న విషయాన్ని తెలిపాడు. ఎవరినైనా తీసుకొని వెంటనే ఫామ్ హౌజ్‌కు రావలసిందిగా కోరాడు.

సచిన్ వంటవాడైన సతీష్‌ను అక్కడి నుంచి దూరంగా వెళ్ళిపోవలసిందిగా బెదిరించి, ఇంట్లోకి ప్రవేశించి టెలిఫోన్ కనెక్షన్ తీసివేశాడు. టెలిఫోన్ డబ్బాను పగులగొట్టాడు. ఆ తర్వాత నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. రాకేష్ ఇంట్లోంచి బయటికి వచ్చి చూసేసరికి గిరీష్ రక్తం మడుగులో పడిపోయి చనిపోయి ఉన్నాడు.

రాకేష్ వెంటనే వాత్వా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మధ్యాహ్నం 2.40 గంటలకి పోలీసులు నిందితులపై కేసు నమోదు చేశారు. పోలీసుల పరిశోధన పూర్తయ్యాక నిందితులపై ఐపిసి లోని 120బి, 425, 302 ఐపిసి కింద, సెక్షన్ 25 (1) ఆయుధాల చట్టం కింద కేసు నమోదు చేశారు. విచారణ కోర్టు ముందు నిందితులందరూ తాము ఏ నేరం చేయలేదని చెప్పటంతో వారిపై నేరవిచారణ మొదలయింది. వీరి నేరాన్ని నిరూపించేందుకు ప్రాసిక్యూషన్ 14 మంది సాక్షులను ప్రవేశపెట్టింది. కొన్ని డాక్యుమెంట్లను కోర్టుకు సమర్పించింది. నిందితుల తరఫున ఎలాంటి సాక్ష్యాన్ని ప్రవేశపెట్టలేదు. నేరవిచారణ పూర్తయిన తర్వాత నిందితులందరిపై నేరాలు రుజువయినట్టుగా న్యాయస్థానం ప్రకటించింది. నిందితులు కుట్ర చేసి గిరీష్‌ను హత్య చేసినట్టుగా భావించి నిందితులందరికీ జీవితఖైదు విధించింది. మృతుడు నమ్రతతో మోంటు పెళ్ళికి అంగీకరించక పోవటం వల్ల అతడిని నిందితులు హత్య చేశారని న్యాయస్థానం భావించింది.

ఆ తర్వాత నిందితులు హైకోర్టుకు అప్పీలు చేసుకున్నారు. కానీ మొత్తం సాక్ష్యాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన హైకోర్టు కూడా నిందితులకు జీవితఖైదు శిక్షను ఖరారు చేసింది. చివరి అవకాశంగా నిందితులు సుప్రీం కోర్టుకు అప్పీలు చేసుకున్నారు. ముగ్గురు నిందితులు యావజ్జీవ శిక్షను అనుభవిస్తున్నందువల్ల వీరి అప్పీలును మళ్ళీ మొత్తం సాక్ష్యాలన్నింటినీ సుప్రీంకోర్టు న్యాయమూర్తులు పరిశీలించారు.

1993 ఫిబ్రవరి 7న మధ్యాహ్నం 2.40 గంటలకు ప్రాథమిక సమాచార రిపోర్టు పోలీస్ స్టేషన్‌లో నమోదయింది. నేరం జరిగింది మధ్యాహ్నం 1.15 గంటలకు. నేర స్థలం నుంచి పోలీస్ స్టేషన్ నాలుగు కిలో మీటర్ల దూరంలో ఉంది. రాకేష్ పూర్తి వివరాలతో తెలిపిన స్టేట్‌మెంట్ ఆధారంగా ఎఫ్ఐఆర్ జారీ చేశారు. అదే రోజు సాయంత్రం శవపంచనామా చేశారు. పోలీసులు పంచనామా చేసి నేర స్థలం నుంచి మారుతీకారును, ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నారు.

రాకేష్ స్టేట్‌మెంట్ ప్రకారం సంఘటన జరిగిన 30 నిమిషాలకు అతడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నాడు. అలాగే వంటమనిషి సతీష్, మృతుని ఇతర కుటుంబ సభ్యులు అదే రోజున పోలీస్ స్టేషన్‌కు వెళ్ళారు. రాకేష్ మృతునికి సమీప బంధువు కావడంతో అతడు నేరం జరిగినప్పుడు అక్కడే ఉన్నాడనీ, అతని కళ్ళ ముందే హత్య జరిగిందని విచారణ కోర్టు నమ్మింది. డాక్టర్ సాక్ష్యం ప్రకారం పోస్టుమార్టమ్ జరగటానికి తొమ్మిది గంటల ముందు మృతుడు చనిపోయాడు. మృతునికి 30 గాయాలు కావటంవల్ల అతడు మరణించాడు. ఈ కేసులో ఎఫ్ఐఆర్ దాఖలు చేయటంలో ఎలాంటి ఆలస్యం జరగలేదు. సాక్షులందరూ చెప్పిన దానిని బట్టి నేరం ఆరోజు మధ్యాహ్నం 1.15 గంటలకు జరిగింది. అక్కడ గొడవ జరుగుతుందన్న విషయం టెలిఫోన్ ద్వారా 2.10 గంటలకు తెలిసింది. మృతుని భార్య ఉమ నేర స్థలానికి 2.30 గంటలకు చేరింది. అక్కడి నుంచి రాకేష్ పోలీస్ స్టేషన్‌కు వెళ్ళి 2.40 గంటలకు ఫిర్యాదు చేశాడు. శవ పంచనామా 3.00 గంటలకు మొదలై 3.45 గంటలకు ముగిసింది. నేర స్థల పంచనామా నాలుగు, ఆరు గంటల మధ్య జరిగింది.

కానీ నిందితుల న్యాయవాది మరో విధమైన వాదన చేశాడు. అప్పటికే రెండు నెలల ముందు అయోధ్యలోని బాబ్రీమసీదును కూల్చివేయటం వల్ల ముస్లింలు హిందువులపై కోపంతో ఉన్నారు. మృతుడు గిరీష్ నామ్‌దార్ తన ఇంట్లో సట్టా ఆడుతున్నాడు. ఈ రెండు కారణాల వల్ల ముస్లింలు అతడిపై కోపంతో కత్తులతో గాయపరిచి హత్య చేసి ఉండవచ్చు. కానీ నమ్రత, మోంటుల వ్యవహారంతో ఇరు కుటుంబాల మధ్య ఉన్న కక్షలను దృష్టిలో పెట్టుకొని పోలీసులు ఈ నిందితులపై గిరీష్ హత్యానేరాన్ని మోపారు. కానీ ఈ వాదనను కోర్టు అంగీకరించలేదు. అదీ గాక మృతుడు గిరీష్ సట్టా వ్యాపారం నిర్వహించినట్లు ఎలాంటి ఆధారాలు లేవు.

ఈ కేసులో మొత్తం సాక్ష్యాన్ని పరిశీలించాక విచారణ కోర్టు తీర్పును, హైకోర్టు తీర్పును పరిశీలించాక సుప్రీంకోర్టుకు ఆ తీర్పులను తప్పుబట్టడానికి ఎలాంటి కారణాలు కనిపించలేదు. అందువల్ల ముగ్గురు నిందితులు చేసిన అప్పీలును తిరస్కరిస్తూ కింది కోర్టులు ఇచ్చిన తీర్పులను సమర్థిస్తూ వారికి విధించిన జీవిత ఖైదుకు ఖరారు చేస్తూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ◆

కులాతీత వివాహవేదిక

వరుడు కావలెను

✡ 24/5'.1'/చామనఛాయ/ సభ్యత సంస్కారం కలిగి, తెలుగు, హిందీ, గుజరాతీ, తమిళ భాషలు తెలిసిన వధువుకు తగిన వరుడు కావలెను. బాక్స్ నెం : **226,** కేరాఫ్ ప్రజాశక్తి.

✡ 26/5'1"/తెలుపుఛాయ/బి.కాం/ప్రైవేట్ సంస్థలో క్లర్క్/ భర్త చనిపోయి 6 సం॥ల పాప కలిగిన వధువుకు 30నుండి 35 సం॥ల మధ్య వయస్సు కలిగిన ఏదైనా ఉద్యోగం చేస్తున్న వరుడు కావలెను. విడాకులు తీసుకున్నా, పిల్లలున్నా అభ్యంతరం లేదు. బాక్స్ నెం : **227,** కేరాఫ్ ప్రజాశక్తి.

అన్నీ వేదాల్లోనే ఉన్నాయష...

కొండబాబు

అగ్నిహోత్రావధాన్లు : ఈ ఇంగిలీషు వాళ్ళ సంగతంతా అదో వెర్రిమొర్రి

గిరీశం : మీ వంటి ప్రాజ్ఞులు అలా అనడం నాకు ఆశ్చర్యంగా ఉంది. మన శాస్త్రాల్లో మాటలు మనం మరిచిపోయినావుc. ఆ మాటలే తెల్లవాళ్లు దొంగతనంగా పట్టుకుపోయి, శాస్త్రం చెప్పినట్టల్లా ఆచరించి మన రాజ్యం లాక్కున్నారు... మన పుస్తకాల్లో మర్మం కనుక్కొని దొర్లు బాగుపడుతున్నాయి. మన పుస్తకాలు బూజెక్కించి మనం చెడుతున్నాం.

అగ్ని : మీకు చాలా తెలుసును. ఈ తెల్లవాళ్ళు చేసే విద్యలన్నీ మన గ్రంథాల్లోంచి ఎత్తుకెళ్ళినవే. ఈ రెయిళ్లూ గియిళ్లూ యావత్తూ మన వేదాల్లోనే ఉన్నాయష.

* * *

టీవీలో మొగుడూ పెళ్లాలు.. అనే కాలహరణం... సారీ... కాలక్షేపం కార్యక్రమం వస్తోంది.

"మీ అబ్బాయిని ఎక్కడ చదివించాలనే విషయం మీద ఇపుడు మీరిద్దరూ వాదులాడుకోవాలి" యాంకర్ చెప్పాడు. వారికి ఇంకేమీ పనిలేనట్లు.

వెంటనే ఒక జంట గొడవకు దిగింది.

"అబ్బాయిని అమెరికాలో చదివిద్దాం" అన్నాడతగాడు.

"వద్దు.. ఇక్కడే చదివిద్దాం.." అందావిడ.

"ఏం? ఎందుకని?"

"మన దేశంలో చదివిద్దాం.. దేశభక్తి పెంచుదాం"

"అయితే సరే.."

వెంటనే యాంకర్ అందుకున్నాడు.

"అవునండి.. మీరు కరెక్ట్. మేరా భారత్ మహాన్. నేను ఎన్నో దేశాలు తిరిగాను. మన దేశం లాంటి దేశాన్ని ఎక్కడా చూళ్ళేదు. మనది కర్మభూమి. అధ్యాత్మికత... వేదాలు... ఇలాంటివన్నీ మన దేశంలోనే పుట్టాయి, ప్రపంచ దేశాల్లోనే మన దేశం గొప్పది"

* * *

ఇటీవల వివాదాస్పద సినిమాలో...

టెర్రరిస్టును ఒక అధికారి ఇంటరాగేట్ చేస్తుంటాడు. ఇంటరాగేషన్ అంటే రహస్యాలు రాబట్టడం కానీ... అతగాడే ఆవేశపడిపోతూ..

"ఎన్ని పాకిస్తాన్‌లు వచ్చినా మా వెంట్రుక ముక్కను కూడా పీకలేరు" అంటాడు.

* * *

– పేర్కొన్నవి చాలా చిన్న సంఘటనలు. ఇంతకంటే ఎక్కువగా... సినిమాల్లో, టీవీల్లో, పుస్తకాల్లో, పత్రికల్లో కూడా 'దేశభక్తియుత' ఉద్వేగపూరిత నినాదాలు



వినిపిస్తుంటాయి.

తొలుత పేర్కొన్న గిరీశం, అగ్నిహోత్రావధాన్ల సంభాషణ వందేళ్ళ క్రితంది. 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయట... అన్నిటా మన దేశమే గొప్పదట' అనే భావజాలం ఎప్పుడూ తప్పేనని ఆనాడే నెగెటివ్ పాత్రల ద్వారా ఆ విధంగా వెటకారం చేశారు గురజాడ.

కానీ 'అన్నీ వేదాల్లోనే ఉన్నాయట' బాపతు నేడు ఎక్కువై పోయిందనడానికి తర్వాతి సన్నివేశాలే తార్కాణాలు.

దేశభక్తి పేరుతో దేశ దురభిమానాన్ని తలకెక్కించే వ్యాఖ్యానాలు, పలుకుబడులు ఇటీవల కోకొల్లలుగా వస్తున్నాయి. దేశాభిమానం వేరు... దురభిమానం వేరు... అభిమానమంటే దేశం సుభిక్షంగా ఉండాలని, అన్నింటా ముందుండాలని కోరుకుని, అందుకోసం యోచించడం, శ్రమించడం. మన ప్రజలను దోపిడీపాలు (విదేశీ, స్వదేశీ ఏదైనా సరే) కాకుండా కాపాడుకోవడం కోసం దేశభక్తి అవసరం. దేశాభిమానం, దేశభక్తి వల్ల మన భూభాగాన్ని, ప్రజలను అభివృద్ధి చేసుకోవడం, రక్షించుకోవడం అనే ప్రయోజనాలున్నాయి.

దేశ దురభిమానమంటే ఉన్నా లేకున్నా అన్నింటా మన దేశమే ముందుందని, మనమే గొప్పని భ్రమల్లో బతకడం. దురభిమానం వల్ల నష్టాలు తప్ప ఒక్కటైనా ప్రయోజనముండదు. దురభిమానంలో వాస్తవికత ఉండదు. అంతా భ్రమ, ఉద్వేగము, పిచ్చితనమూనూ. నిజమైన దేశభక్తులకు ఉండకూడని లక్షణమిది. ఎందుకంటే ఇది నష్టదాయకమైనది కాబట్టి.

మనమే గొప్ప అనుకుంటే ఇతరుల నుంచి నేర్చుకోవడానికి సిద్ధపడనివ్వదు ఆ అహం. మనమే వీరులం అనుకుంటే మన వాస్తవిక బలమేమిటో తెలియనివ్వదు. ఇలాంటి సందర్భాల్లో ఎదురు దెబ్బతింటాం. పై సంభాషణల్లో ఇంటరాగేషన్ ఆఫీసరు మన దాయాదిని సవాలు చేసినట్లు 'అమెరికాను చేయగలరా? అనేది ప్రశ్న.

నిజంగా అన్నీ మన వేదాల్లోనే ఉంటే, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానమంతా మనకు వేరే వారి నుంచి రావలసిన, నేర్వవలసిన అవసరమేముంది? మనలను మనం ఎప్పుడూ గొప్పగా అనుకోవడం వల్ల, అన్నీ మనకే తెలుసనుకోవడం వల్ల ఏమీ నేర్చుకోలేము. నేర్చుకున్నా ఎదగలేము.

దేశాల విషయంలోనైనా, వ్యక్తులుగానైనా ఎవరికి వారికి దురభిమానం ఉంటే ఎవరం ఎవరితో కలవలేము. ఆత్మవిశ్వాసం వేరు.. అహంకారం వేరు. ఆత్మ విశ్వాసం శక్తినిస్తుంది. దురభిమానం అహంకారం వంటిది. వ్యక్తిగా, కుటుంబంగా, వంశంగా, జాతిగా, ప్రాంతంగా.. ఏ రీత్యానూ మనమే గొప్పనే 'దురభిమాన' భావన ఉండరానిది. ఉంటే కయ్యాలవారిగా మారిపోతాం. స్థంభించి పోతాం.

నిజంగా ఏ దేశానికి ఆ దేశం తామే గొప్పగా అక్కడి వారు అనుకుంటారు. ఎవరికి వారు తామే గొప్ప అనుకునేదాంట్లో గొప్పేముంది ? మన 'గొప్ప'ను ఇతరులు చెప్పడం, మెచ్చడం గొప్పగాని. ఇతరులు మెచ్చేలాగా మనం ఉండాలంటే అందరి ప్రయోజనాల కోసం ఆలోచించాలి. శ్రమించాలి. అవతలి వారి మనోభావాల నుంచి కూడా ఆలోచించి సమగ్రతకు రావాలి. అందాకా 'దురభిమానం'తో కూడిన ప్రేలాపనలకు, ప్రగల్భాలకు, పలుకుబడులకు, అవి పలికే వారికీ అడ్డు చెబుదాం. ◆

పాఠక స్పందన

వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టింది

జనవరి 19వ తేదీ సంచికలో వచ్చిన 'బుజ్జి కన్న' కథ నేటి వాస్తవ పరిస్థితులకు అద్దం పట్టింది. గేదెను అమ్మాలనుకున్నప్పుడు కుటుంబ సభ్యుల మధ్య జరిగిన చర్చ కంటతడి పెట్టించింది. చివరికి గేదె ఇంటికి తిరిగి వచ్చినప్పుడు మనస్సు ఆనందంతో తేలికపడింది. వాస్తవ సన్నివేశాలకు అనుగుణంగా భాష కూడా ఉంది. రచయితకు ధన్యవాదాలు.

– **సంధు వెంకటేశ్వరరావు**, దర్శి, ప్రకాశం జిల్లా

ఆకట్టుకున్న కళాసాహితి

జనవరి 26వ తేదీ ఆదివారం అనుబంధంలో కళా సాహితి శీర్షికన ప్రచురించిన స్త్రీ పాత్రలో రాణిస్తున్న శాయనపూడి వెంకటేశ్వరరావు రంగస్థల కళాకారునిగా నాటక రంగానికి చేసిన సేవ మరవరానిది. స్త్రీ పాత్రల్లో లీనమై నటించడంలో తనకు తానే సాటి అని ఆయన నిరూపించుకోవడం ఆసక్తి కలిగించింది. స్త్రీ వేషధారణలో ముద్రించిన ఆయన చిత్రం ఎంతగానో ఆకట్టుకుంది.

– **మేదూరి సత్యనారాయణ**, తిరువూరు కృష్ణాజిల్లా